
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php




సంపుటి 15 సంచిక 201 విశాఖపట్నం బుధవారం 22 మార్చి 2023 8 పేజీలు వెల : 5.00




### ప్రభుత్వ పాఠశాలల్లో వారంలో...

# మూడు రోజులు రాగి జావ: జగన్



అమరావతి: పాఠశాల విద్యార్థులు పౌష్టికాహార లోపంతో బాధపడకూడదని.. అందుకే రాష్ట్ర ప్రభుత్వం రాగి జావ అందిస్తోందని ఏపీ సీఎం జగన్ అన్నారు. 'జగనన్న గోరుముద్ద' పథకంలో భాగంగా రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పిల్లలకు సదుపాయాలు కల్పించడం సహా మేథో వికాసం పెంచడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రాగిజావ సరఫరా ద్వారా వారికి పోషకాహార లోపం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం తెలిపారు. వారంలో మూడు రోజుల పాటు దీన్ని అందిస్తామన్నారు. 'గోరుముద్ద' పథకాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దేందుకు అడుగులు వేస్తున్నామని చెప్పారు. రాగిజావ పంపిణీ కోసం ఏటా రూ.86 కోట్లు ఖర్చు అవుతుందని.. వీటిలో సత్యసాయి ట్రస్ట్ రూ.42కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.44 కోట్లు భరిస్తున్నాయని జగన్ వివరించారు. పథకంలో భాగస్వాములవుతున్నందుకు సత్యసాయి ట్రస్ట్‌ను సీఎం అభినందించారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులతో జగన్ మాట్లాడారు.

# వ్యక్తిగత వివరణకు అనుమతించండి

### లోక్‌సభ స్పీకర్‌కు రాహుల్ లేఖ



న్యూఢిల్లీ : సీనియర్ మంత్రుల ఆరోపణలపై స్పందించేందుకు అనుమతించాల్సిందిగా కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. ఈ మేరకు రాహుల్‌గాంధీ మంగళవారం స్పీకర్‌కు లేఖ రాశారు. లోక్‌సభలో సీనియర్ మంత్రులు తనపై పూర్తి నిరాధారమైన, అన్యాయమైన ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాలు, రాజ్యాంగంలో పొందుపరిచిన న్యాయబద్ధమైన నిబంధనలు, లోక్‌సభ విధివిధానాలు, ప్రవర్తనా నియమాలలోని రూల్ 357 ప్రకారం తాను అనుమతిని కోరుతున్నానని అన్నారు. సభలో ఎలాంటి ప్రశ్న అడగకపోయినా స్పీకర్ అనుమతితో సభ్యులు వ్యక్తిగతంగా వివరణ ఇచ్చేందుకు రూల్ 357 అనుమతిస్తుంది. ఈ సందర్భంలో ఎలాంటి చర్చనీయాంశం ముందుకు తీసుకువచ్చేందుకు, చర్చను లేవనెత్తకుండా నిరోధిస్తుంది. పాలక సభ్యులు పార్లమెంట్ వెలుపల, లోపల తనకు వ్యతిరేకంగా అవమానకరమైన, పరువునష్టం కలిగేలా వ్యాఖ్యలు చేస్తున్నారని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు రూల్ 357 ప్రకారం ప్రత్యుత్తరమిచ్చే హక్కుని కల్పించాలని ఆ లేఖలో పేర్కొన్నారు.గతంలో పార్లమెంటులో జ్యోతిరాథిత్య సింధియాపై ఆరోపణలు చేసినపుడు ఎంపి, అప్పటి మంత్రి రవిశంకర్ ప్రసాద్‌కి రూల్ 357 ప్రకారం వివరణనిచ్చేందుకు అనుమతిచ్చారని గుర్తుచేశారు. అలాగే లోక్‌సభ డిజిటల్ లైబ్రరీలో అనేక ఉదాహరణలు అందుబాటులో ఉన్నాయని, ఈ హక్కులో పార్లమెంటులో చేసిన ప్రకటనలపై ప్రతిస్పందించేందుకు మాత్రమే పరిమితం కాదని, పబ్లిక్ డొమైన్‌లో చేసిన ఆరోపణలకు కూడా వర్తిసుందని లేఖలో తెలిపారు.లండన్‌లో భారత ప్రజాస్వామ్యాన్ని అవమానించారని,. రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాల్సిందేనంటూ బిజెపి సభ్యులు పార్లమెంట్‌లో నినాదాలు చేస్తున్న సంగతి తెలిసిందే. గతవారం ప్రారంభమైన పార్లమెంట్ రెండో బడ్జెట్ సమావేశాలు ఎటువంటి చర్చ జరగకుండానే వాయిదా పడుతున్నాయి.

# కేంద్రం అప్పు రూ.155 లక్షల కోట్లు

### : కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్




న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం అప్పు రూ.155.8 లక్షల కోట్లని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. లోక్‌సభలో బిఆర్ఎస్ ఎంపి నామా నాగేశ్వరరావు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్రం అప్పు జిడిపిలో 57.3 శాతమని అన్నారు. ఇందులో రూ.7.03 లక్షల కోట్లు (2.6 శాతం) విదేశీ అప్పు అని తెలిపారు.

93,384 పోలవరం బాధిత కుటుంబాలకు అందని పరిహారం

93,384 పోలవరం బాధిత కుటుంబాలకు ఎటువంటి పరిహారం అందలేదని కేంద్ర జలశక్తి సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడ తెలిపారు. రాజ్యసభలో టిడిపి ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

**పాఠకులకు, ప్రకటనకర్తలకు,**

**శ్రీ శోభాకృత్ నామ సంవత్సర**

## ఉగాది శుభాకాంక్షలు

నేడు ఉగాది సందర్భంగా మా కార్యాలయమునకు శెలవు. కావున రేపు సంచిక వెలువడదు. పున:దర్శనం శుక్రవారం.

\- ఎడిటర్






## రాష్ట్ర ప్రజలకు శోభకృత్ నామ ఉగాది శుభాకాంక్షలు - టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



పర్చూరు, మార్చి 21, ప్రజాపాలన : రాష్ట్ర ప్రజలకు తెలుగు సంవత్సరాది శోభకృత్ నామ ఉగాది సందర్భంగా, తెలుగుదేశం పార్టీ బావ ట్ల పార్లవెంట్ అధ్యక్షులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి. సాంబశివరావు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు సంవత్సరం కొత్త ఏడాదిలో కొత్త ఉత్తేజం,ఉల్లాసం, ఉజ్వల భవిష్యత్తును తెస్తుందని ఆకాంక్షించారు. షడ్రుచులు(తీపి, చేదు, పులుపు,ఉప్పు,కారం,వగరు) లా కష్ట సుఖాల సమ్మే ళనంతో ముందుకు సాగాలన్నారు. శోభకృత్ నామ ఉగాది ప్రజలకు శాంతి, సంతోషం కలిగిస్తుందన్నారు. కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరూ, తమ లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు.ఆయా రంగాల వారు,ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అన్నదాతలు పాడి పంట లతో తులతూగాలన్నారు. రాష్ట్రాని కి త్వరలో మంచి రోజులు రానున్నాయన్నారు. ప్రజలం దరూ కుటుంబ సభ్యులతో, ఉల్లాసంగా గడపాల న్నా రు.తెలుగు ప్రజలందరికి నూతన సంవత్సరం సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## రాగిజావ చిన్నారుల ఆరోగ్యానికి ఎంతో మేలు - జిల్లా కలెక్టరు కె.విజయకృష్ణన్



చీరాల, మార్చి 21, ప్రజాపాలన : ప్రభుత్వం పంపిణీ చేసే రాగిజావ చిన్నారుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని జిల్లా కలెక్టరు కె.విజయకృష్ణన్ తెలిపారు. జగనన్న గోరుముద్దలో భాగంగా, బడిపిల్లలకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం తాడేపల్లిలోని సి.ఎం క్యాంపు కార్యాలయం నుంచి, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారం భించారు.విద్యార్థులను ద్దేశించి, రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చ్చారు. అనంతరం జిల్లా కలెక్టరు విజయకృష్ణన్, బాపట్ల, చీరాల ల శాసనసభ్యులు కోన రఘుపతి, కరణం బలరామకృష్ణమూర్తి, బత్తుల బ్రహ్మానందరెడ్డి, కలిసి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

# తెలుగు భాషపై విస్తృత ప్రచారం చేద్దాం!

### నవ్యాంధ్ర రచయితల సంఘం, మల్లెతీగ సారథ్యంలో ఘనంగా ఉగాది ఉత్సవాలు



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి మార్చి 21: కృష్ణా తీరంలో ఒకరోజు ముందుగానే ఉగాది సందడి కనిపించినట్టయింది. అందుకు వేదికగా నవ్యాంధ్ర రచయితల సంఘం, మల్లెతీగ సారథ్యంలో మంగళవారం స్థానిక ఠాగూర్ స్మారక గ్రంథాలయం సమావేశ మందిరంలో జరిగిన ప్రపంచ కవితా దినోత్సవంతోపాటు ఉగాది ఉత్సవాల పేరిట సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిలిచాయి. ఆహ్లాదకర వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా ట్రిపుల్ గిన్నీస్ వరల్డ్ రికార్డ్సు గ్రహీత, గజల్ మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, ప్రత్యేక అతిథులుగా శ్రీ దేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠం పీఠాధిపతి కరుమారి దాసు, గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఆర్.ఆర్.గాంధీనాగరాజన్, అతిథులుగా సుప్రసిద్ధ కవి, విమర్శకులు జి.లక్ష్మీనరసయ్య, సుప్రసిద్ధ కవి, అరసం ప్రతినిధి అరసవల్లి కృష్ణ, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా కమిషన్ సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, సోషల్ యాక్టివిస్టు రజితా లహరి హాజరయ్యారు. జాషువా కవిత్వాన్ని ప్రస్తావిస్తూ తొలి పలుకులు చేసిన జి.లక్ష్మీనరసయ్య వివిధ భావజాలాలు, వివిధ రంగాల్లో పనిచేస్తున్నటువంటి విశిష్ట వ్యక్తుల్ని ఒక వేదికపై నిలిపిన నిర్వాహకులను అభినందించారు.ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో గ్రంథాలయాలు గతంలో నిర్లక్ష్యంగా, నిర్వీర్యంగా పక్కకు నెట్టివేయబడ్డాయని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గ్రంథాలయాల ప్రాధాన్యత, ప్రాముఖ్యత తెలిసేవిధంగా సూచనలు చేయడమేకాకుండా ఆధునికతను, సాంకేతికతను అందిపుచ్చుకునేలా లైబ్రరీ డిజిటలైజేషన్ వైపు మళ్లించడంతో గ్రంథాలయాలు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయని గట్టిగా చెప్పగలమన్నారు. కార్యక్రమంలోభాగంగా సరికొండ నరసింహరాజు రచించిన 'వర్ణాలు లేని వాక్యాలు' కవితా సంపుటిని గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు ఆవిష్కరించి తొలి ప్రతిని డాక్టర్ గజల్ శ్రీనివాస్ కు అందజేశారు. అలాగే మల్లెతీగ ఉగాది పురస్కారాలను విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు, మందరపు హైమవతి, అమూల్య చందు, డాక్టర్ ఘంటా విజయ్ కుమార్, సరికొండ నరసింహరాజు, శిఖా ఆకాష్, శ్రీమతి రామరాజు లక్ష్మీ శ్రీనివాస్ లకు అతిథుల చేతులమీదుగా అందజేశారు. మల్లెతీగ ఉగాది యువ పురస్కారాన్ని తంగిరాల సోనికి అందజేశారు.కవులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ కవితాస్త్రాలను సంధించారు. కలిమిశ్రీ, యేమినేని వెంకటరమణ, బండికల్లు జమదగ్ని, కుర్రా సురేష్ బాబు, చొప్పా రాఘవేంద్రశేఖర్ ల నిర్వహణలో జరిగిన ప్రపంచ కవితా దినోత్సవం, ఉగాది ఉత్సవాల్లో తొలుత రాయన శ్రీనివాసరావు శిష్య బృందం నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి.

## అసెంబ్లీలో దాడి సి.సి ఫుటేజ్ ను బయట పెట్టాలి: గుండా శివప్రసాద్

గోకవరం ప్రజా పాలన్ మార్చ్ 21 :వైసిపి ప్రభుత్వ పాలకులకు పిచ్చి ముదిరి పరాకాష్టకు చేరిందని దేవాలయంలాంటి అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడి చేయడం చాలా దారుణమని, దౌర్జన్యాలకు దిగిన ప్రభుత్వమే తిరిగి ప్రతిపక్ష ఎమ్మెల్యే పై అబండాలు వేస్తుందని, అసలు వాస్తవాలు బయట పెట్టాలని, అసెంబ్లీలో దాడి సంఘటనకు సంబంధించిన సిసి ఫుటేజ్ మినిట్ టూ మినిట్ ప్రజల ముందు ఉంచాలని గోకవరం మండలం తెలుగు యువత అధ్యక్షుడు గుండా.శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ పాలకులు మేము ఏది చేసినా, ఏమి చెప్పినా ప్రజలు గుడ్డిగా నమ్మేస్తారని వైసీపీ వారు భ్రమలో ఉన్నారని ప్రజలు వీళ్లను నమ్మే పరిస్థితిలో లేరని ఇటీవల జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరూపణ అయ్యిందని శివప్రసాద్ తెలిపారు. ఒక్క అవకాశం అంటూ మాయమాటలు చెప్పి అధికారం చేపట్టి ఈ రాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తున్నారని, ఇక మీ పప్పులేమి ప్రజలు ఉడకనివ్వరని, అది మీరు తెలుసుకోవాలని శివప్రసాద్ తెలిపారు. మీ పాలనంతా కూల్చడాలు, తప్పుడు కేసులు, కక్షపూరిత వ్యవహారాలతోనే సాగిందే తప్పా రాష్ట్ర ప్రజలకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూర్చే ఒక కార్యక్రమం కూడా మీరు చేపట్టలేకపోయారని శివప్రసాద్ తెలిపారు. రాజధానిని నిర్మించే శక్తి,సామర్థ్యాలు లేక ప్రజల్లో విద్వేషాలు, రెచ్చగొట్టే ప్రయత్నాలు చేశారని కానీ తెలుగువారు సంయమనంతో ఆలోచించసాగారని అది ఆంధ్రుల యొక్క గొప్పతనం అని శివప్రసాద్ తెలిపారు. మీరు చెప్పిన మాటలన్నీ నమ్మేస్తే మూడు ప్రాంతాల వాళ్ళు ఒకరినొకరు కొట్టుకుంటూ ఉండేవారని ఇది చూసి మీరు పైశాసింగా ఆనందం పొందే వారిని శివప్రసాద్ తెలిపారు.

## బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి: ఎమ్మెల్యే కరణం.బలరామకృష్ణమూర్తి



చీరాల, మార్చి 21, ప్రజాపాలన : తల్లిదండ్రులకు, చీరాలకు మంచి పేరు తెచ్చే విధంగా, ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యార్థులు బాగా చదువు కొని ఉన్నత స్థాయికి ఎదగాలని, చీరాల శాసన సభ్యులు కరణం బలరామ కృష్ణమూర్తి విద్యార్థులకు పిలుపు నిచ్చారు. చీరాల మండలం, రామకృష్ణాపురం నందలి, ఎం.యస్.ఎ.ప్రైమరీ స్కూల్లో, రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి చీరాల ఆధ్వర్యంలో, ప్రభుత్వ పాఠశాల విద్యా ర్థులకు, వారానికి మూడు రోజులు రాగి జావ అందించే రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు, దీంతో పాటు, పూర్వ విద్యార్థిని మీనా స్కూల్‌కు అందించిన,100 స్టీల్ గ్లాస్‌ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. విద్యార్థులకు 100 గ్లాసులు పంపిణీ చేసిన అనంతరం, గ్లాసుల దాత పూర్వవిద్యార్థిని మీనాని, ఎమ్మెల్యే బలరామ్ తో పాటు, అతిథులు అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, చీరాల ఎంఈఓ డి.నాగేశ్వర రావు, గ్లాసులదాత ఓల్డ్ స్టూడెంట్ మీనా, నన్నపనేని రామకృష్ణ, నాగమల్లేశ్వరరావు బాచిన, అడ్డగడ్డ మల్లికార్జున రావు, శ్రీ కామాక్షి హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు, రావి వెంకట రమణారావు, రామ కృష్ణాపురం వైఎస్సార్సీపీ నాయకులు నల్లూరి బ్రహ్మం, భాస్కర రావు, కేబుల్ కృష్ణ, అందే సుబ్బారాయుడు, పసుపులేటి కోటేశ్వరరావు, కౌన్సిలర్లు బత్తుల అనిల్, కీర్తి వెంకట్రావు, మండవ గిరీష్, శివ, స్థానిక నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేదోడి వైద్యానికి భరోసా ఆరోగ్య శ్రీ.- డాక్టర్.తాడివలస దేవరాజు.



చీరాల, మార్చి 21, ప్రజాపాలన : హెర్నియా సమస్యతో బాధపడుతున్న వారు, నిర్లక్ష్యం చేయకుండా, ఆరోగ్యశ్రీ వైద్య సేవల ద్వారా, ఉచిత వైద్యాన్ని పొందవచ్చని,డాక్టర్ గవిని లక్ష్మీ నారాయణ తెలియజేశారు. శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ నందు, నిర్వహించిన ఉచిత హెర్నియా వైద్య శిబిరంలో, 53 మంది కి ఉచిత కన్సల్టేషన్ రక్త పరీక్షలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించామని ,అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగాఆపరేషన్ చేస్తున్నామని పేదోడి వైద్యానికి భరోసా ఆరోగ్య శ్రీ అని డాక్టర్ దేవరాజు తెలిపారు. శ్రీ కామాక్షి కేర్ హాస్పటల్ ఆవరణలో, ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ, చీరాలలోని అన్ని రకాల ఎముకల ఆపరే షన్లు,జనరల్, లాప్రోస్కోపి ఆపరేషన్లు, కిడ్నీ రాళ్ల ఆపరేషన్లు, చెవి, ముక్కు, గొంతు ఆపరేషన్లు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా, శ్రీ కామాక్షి కేర్ హాస్పటల్ లో అందిస్తున్నామని తెలియజేశారు.పేషెంట్ చేరిన 24 గంటల లోపే, ఆపరేషన్స్ సంబంధించిన అనుమతుల ను, ట్రస్ట్ అందజేస్తుందని తెలిపారు. డాక్ట ర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వైద్యసేవలను బాపట్ల, పర్చూరు,చీరాలనియోజకవర్గ ప్రజలందరు కూడా వినియోగించు కోవాలని కోరారు. కార్యక్ర మంలో జనరల్, లాప్రోస్కోపి సర్జన్ డాక్టర్ గవిని.లక్ష్మీనారాయణ, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ తులసిరామ్ , ఎముకల స్పెషలిస్ట్ డాక్టర్ ముఖే ష్ రెడ్డి, హాస్పటల్ జీయం తాడివలస సురేష్, ఆరోగ్యమిత్ర అనిల్, బోయాజ్ , శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం: కరస్పాండెంట్ నీలం శామ్యూల్ మోజెస్

చీరాల, మార్చి 21, ప్రజాపాలన : రాష్ట్రంలో ఉన్న అన్ని పాఠశాలల్లో, రాగి జావా డే బై డే విద్యార్థులందరికీ, అందజేయాలన్న ప్రభుత్వ నిర్ణయం



అభినందనీయమని, నీలం జేమ్స్ ఏయిడెడ్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల కరస్పాండెంట్ నీలం శ్యామ్యూల్ మోజెస్ అన్నారు. దానిలో భాగంగా, నీలం జేమ్స్ ఎయిడెడ్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో, రాగి జావా కాచి విద్యార్థులకు, అందచేయు కార్యక్రమాన్ని, పాఠశాల కరస్పాండెంట్ నీలం శామ్యూల్ మోజెస్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆశ వర్కర్స్ నియామకాల్లో రాజకీయ జోక్యం లేకుండా ప్రభుత్వమే నియామకాలు జరపాలి






పల్నాడు జిల్లా. నరసరావుపేట .మార్చి 21 (ప్రజాపాలన ప్రతినిధి,)ఆశ వర్కర్స్ నియామకాల్లో రాజకీయ జోక్యం తొలగించాలని ప్రభుత్వమే నియామకాలు జరపాలని పని భారాన్ని తగ్గించి కనీస వేతనం, ప్రభుత్వ శెలవులు,రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని స్టేషన్ రోడ్డులో గల మున్సిపల్ గాంధీ పార్క్ లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్క్ లో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమానికి యూనియన్ నకరికల్లు మండల అధ్యక్షురాలు భూలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి డి. శివ కుమారి మాట్లాడుతూ శానిటేషన్ కమిటీల ద్వారా నియామకాలు జరపడంతో రాజకీయ నాయకుల పెత్తనం పెరిగిందని కష్టపడి పని చేసేవారి స్థానంలో అధికార పార్టీ అనుయాయులను నియమిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.ఆశా వర్కర్స్ ను ప్రతి రోజు విలేజ్ క్లినిక్ మరియు సచివాలయంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉండాలని క్లినిక్ శుభ్రం చేయడం, ఓపి లకు సంబంధించిన పనులతో పాటు అటెండర్ పనులను సైతం చేయిసున్నారని ఇలా ఆశాలకు సంబంధం లేని ఎన్నో పనులను చేయిన్నూ వేదిన్నున్నారని మండిపడ్డారు. అనంతరం స్టేషన్ రోడ్డులోని గాంధీ పార్క్ వద్ద నుంచి పల్నాడు రోడ్డులోని డిఎం %డ% హెచ్ఓ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ. నిర్వహించారు. డిప్యూటీ డిఎంహెచ్వో చంద్రశేఖర్ కు వినతిపత్రం అందజేశారు.ఆశాల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని ఆయన పేర్కొన్నారు.సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ 2002 లో ఏర్పడిన ఆశా వ్యవస్థ ఆరంభంలో నెలకు రూ 150/- ఉన్న వేతనం సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన అనేక పోరాటాలు ఉద్యమాలతో అధికార పార్టీ నాయకుల మెడలు వంచడంతో క్రమంగా పెరుగుతూ రూ 10 వేలకు చేరిందన్నారు. 12 ఏళ్ళ క్రితమే అప్పటి ధరలకు అనుగుణంగా రూ 18 వేలు ఇవ్వాలని సిఐటియు పోరాటం చేస్తుందని ప్రస్తుత పెరిగిన ధరలకు అనుగుణంగా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చాలి చాలని వేతనాలతో ప్రభుత్వానికి సేవలు చేసిన ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏమి ఇవ్వకుండా ఉట్టి చేతులతో పంపిస్తున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ఆశా వర్కర్ల వ్యవస్థ నిర్వీర్యం చేసే కుట్రలు చేన్తున్నారని ఆరోపించారు. డి.ఎం %డ% హెచ్.ఓ కార్యాలయాల వద్ద ధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆశాలను ధర్నాకు రాకుండా అడ్డుకోవాలన్న దురుద్దేశ్యంతో పి.హెచ్.సి లలో సమావేశాలు ఏర్పాటు చేశారని మండిపడ్డారు.రైల్వే స్టేషన్, బస్టాండ్, ఇళ్ల వద్ద పోలీసులు పహారాకాచి చాలా ప్రాంతలలో అడ్డుకున్నప్పటికీ 6 వేల మందికి పైగా అంగన్వాడీ లు ఐక్యంగా మహా ధర్నాను జయప్రదం చేశారని అంగన్వాడీ ల ఐక్యతను స్ఫూర్తిగా తీసుకొని ఆశాలు కూడా న్యాయమైన హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.ఆశా వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు కె.హనుమంత రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాలలో ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు.ఆశాలకు ప్రస్తుతం ఇస్తున్న రూ 10 వేలలో విధి నిర్వహణ బాగంలో రూ 5 వేలు అయిపోతున్నాయని మిగిలిన రూ 5వేల తో కుటుంబ పోషణ ఎలా అని ప్రశ్నించారు. వీటికి ఆశాలపై రాజకీయ వేధింపులు దుర్మార్గమన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఆశాలు తమ పని వారు సక్రమంగా చేసుకుంటూ పోతున్నారని వారిపై రాజకీయ వేధింపులు ఆపాలని లేని యెడల ఆశాలను ఐక్యం చేసి మరో ఉద్యమం చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

కార్యక్రమంలో సిఐటియు నరసరావుపేట మండల అధ్యక్ష కార్యదర్శిలు షేక్ సిలార్ మసూద్, ఈవూరి మస్తాన్ రెడ్డి, సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు హుస్సేన్, నరసరావుపేట నాయకులు నీరజ,సత్యవతి, కోటప్పకొండ పిహెచ్సి నాయకులు నాగలక్ష్మి గోవిందమ్మ, నకరికల్లు మండల యూనియన్ కార్యదర్శి నూర్జహా, సిఐటియు రొంపిచర్ల మండల కార్యదర్శి సరికొండ వెంకటేశ్వరరాజు, సమైక్యాంధ్రప్రదేశ్ ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జిలాని మాలిక్ పల్నాడు జిల్లాలోని అన్ని మండలాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటి నుండి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం




బాపట్ల జిల్లా ప్రజా పాలన మార్చి 21: తెలుగుదేశం, మీ మాట నా బాట కార్యక్రమం మధ్యాహ్నం 3 గం.లకు పిట్లవానిపాలెం మండలం, మంతెనవారి పాలెం గ్రామం నుండి మొదలపెట్టబోతున్నాను.మీ మాట నా బాట కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం నియోజకవర్గంలో ని ప్రతి ఇంటికి వెళ్లి బాపట్ల నియోజకవర్గ అభివృద్ధి మీద అందరి అభిప్రాయాలను తెలుసుకొని రేపు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గ అభివృద్ధి కొరకు చేపట్టబోయే ప్రణాళికలు, ప్రజా సంక్షేమానికి అమలు చేసే పథకాలు, నా ఆలోచన విధానాలను వివరించడం.ఉగాది పర్వదినం సందర్భంగా పీవీ పాలెం లోని నరసింహ స్వామి దేవస్థానం నందు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందుకొని తదనంతరం మధ్యాహ్నం 3 గం.లకు తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులతో భారీ ఎత్తున ర్యాలీగా వెళ్లి మంతెనవారి పాలెం నందు ప్రారంభించే ఈ కార్యక్రమం నియోజకవర్గంలోని ప్రతి గడపను పలకరిస్తూ దాదాపు 6 నెలల పాటు 1000 కీమీ ల పాటు సాగుతోంది.ఈ కార్యక్రమం ద్వారా 6 నెలల్లో నియోజకవర్గంలో ఉన్న దాదాపు 90000 ఇళ్ళ కు వెళ్లి మహిళ మణుల కోసం ప్రత్యేకంగా తెప్పించిన చీరను, నిత్యావసర వస్తువులు తెచ్చుకొనే సంచి, మరియు మా గురుంచి తెలియజేసే ఒక కరపత్రం అందజేసి వారి నుండి ఆశీస్సులు అందుకోవడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మీడియా మిత్రులు అందరూ పాల్గొని కవర్ చేయాలని నరేంద్ర వర్మ కోరారు ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం



బాపట్ల జిల్లా ప్రజా పాలన మార్చి 21: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇచ్చి స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని బాపట్ల మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్ అన్నారు. బాపట్ల పురపాలక సంఘం పరిధిలో స్వచ్ఛత 2023 అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగత స్వయం సహాయక చిన్న తరహా,సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రం, వ్యర్థాల శుద్ధికరణ,చెత్త సేకరణ, కళాకృతుల తయారీ,తడి చెత్త వినియోగం వంటి విభాగాల కింద కృషి చేస్తున్న మహిళలు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 22వ తేదీ లోపు మీ సమీప సచివాలయంలో, పారిశుధ్య కార్యదర్శులకు గానీ దరఖాస్తులు అందజేయాలని చెప్పారు. ఎంపికైన వారికి జూన్ 5వ తేదీన జరగనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకలలో అవార్డులు అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఏఈ ఉమామహేశ్వరరావు,సానిటరీ ఇన్స్పెక్టర్ కొండయ్యను సంప్రదించాలని పేర్కొన్నారు.

# తోడేళ్లు ఎన్ని ఏకమైనా.. విజయం మనదే..




రాజుపాలెం: ప్రజాపాలన ప్రతినిధి: ఎవరి కోసమో పార్టీ పెట్టి, బాబు ముఖ్యమంత్రి కావాలనే తాపత్రయంతో ఆయన సంకనక్కితే బలి పశువు అయ్యేది పవన్ కళ్యాణేనని ,అలాంటి వారిని నమ్మాలా అని రాష్ట్ర జలవనరుల శాఖా మాత్యులు అంబటి రాంబాబులి ప్రశ్నించారు. మంగళవారం మండల పరిధిలోని గణపవరం గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారధుల శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి మండల నాయకులు మర్రి సుబ్బారెడ్డి అధ్యక్ష వహించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ తోడేళ్లు ఎన్ని ఏకమైనా అంతిమ విజయం వైయస్సార్ సిపి దేనన్నారు. మళ్ళీ ముఖ్యమంత్రి జగనే కావాలనే ఆకాంక్ష ప్రజల్లో బలియంగా ఉందన్నారు. పారదర్శక సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే దక్కిందన్నారు .సత్తెనపల్లి నాది, నాది అని చాలామంది తిరుగుతున్నారని ఈ మధ్య కొత్తగా కూడా ఒకాయన వస్తున్నారని ఎంతమంది వచ్చినా మనకు భయం లేదన్నారు. అభివృద్ధి లేదని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, ప్రతి గ్రామంలోనూ కోట్ల రూపాయల విలువైన శాశ్వత భవనాలు నిర్మిస్తున్నామన్నారు.వెల్ లెస్ కేంద్రాలు,, రైతు భరోసాలు, సచివాలయాలు ఇవన్నీ అభివృద్ధి కాదా అని, ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇలాంటి దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టి ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్ళేలా ఉత్సవాలలో గృహ సారధులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సంయుక్తంగా కృషి చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, సర్పంచ్ గనుపల్లి వెంకట రమణ, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి, జడ్పిటిసి సభ్యులు దొంతి రెడ్డి సునీత రెడ్డి , రాజుపాలెం మండల సచివాలయాల కన్వీనర్ల ఇన్చార్జి పులిబండ్ల అశోక్, సత్తెనపల్లి మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, మండల కన్వీనర్లు భవనం రాఘవరెడ్డి, రాయపాటి పురుషోత్తమరావు, నక్క శ్రీనివాస రావు, జెసిఎస్ మండల ఇన్చార్జీలు రెండెద్దుల వెంకటేశ్వర రెడ్డి, కొణతం స్వాతి, చిలకా జైపాల్, గనుపల్లి బుల్లిబాబు, తేలుకుట్ల చంద్రమౌళి స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు

## శ్రీ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవ వేడుకలు



పల్నాడు జిల్లా. నరసరావుపేట. మార్చి 21 (ప్రజాపాలన ప్రతినిధి,): స్థానిక పనసతోటలోని శ్రీ విద్యా వికాసిని స్టడీ సర్కిల్ నందు అంతర్జాతీయ సాంస్కృతిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళావేదిక జిల్లా జనరల్ సెక్రటరీ గుండాల రాకేష్ ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది .ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ గారి పిలుపుమేరకు తెలుగు భాష పై మక్కువ కలిగించడానికిబి విద్యార్థుల మధ్య కవి సమ్మేళనం నిర్వహించడం జరిగింది. ఈ కవి సమ్మేళనంలో పాల్గొన్న శ్రీ శ్రీ కళా వేదిక జిల్లా జనరల్ సెక్రెటరీ గుండాల రాకేష్ మాట్లాడుతూ" తెలుగు భాషను, సాంప్రదాయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఆంధ్రుడు పై ఉందని, నేటి సాంకేతిక యుగంలో ప్రతి పిల్లవాడికి తెలుగు పద్యం, వచనప్రక్రియలు, కథలు, సామెతలు నేర్పించాల్సిన అవసరం ప్రతి తల్లిదండ్రులపై ఉందని, తెలుగు భాషకు అమూల్యమైన సేవలు అందిస్తున్న శ్రీ శ్రీ కళా వేదిక అంతర్జాతీయ అధ్యక్షులు డా. కత్తిమండ ప్రతాప్ గారికి, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి గారికి, జాతీయ కార్యదర్శి జి. ఈశ్వరి భూషణం గారికి, రాష్ట్ర అధ్యక్షులు గుత్తా సర్వోత్తమ నాయుడు గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.ఈ కవి సమ్మేళనంలో పాల్గొని తమ కవితలు వినిపించిన యువకవులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సమ్మేళనంలోశ్రీ శ్రీ పల్నాడు జిల్లా యూత్ అధ్యక్షురాలు పఠాన్, కరిష్మా, హాఫీ,అమరలింగేశ్వరరావు, ప్రసన్నలక్ష్మి, సఫ్రున్నిసా, వినోద్, భాషా, సందాని, ఆనంద్ మరియు విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయడం జరిగింది.

## చిన్నారి వైద్యానికి సోము ప్రసాద్.10వెలు ఆర్థిక సాయం



గోకవరం ప్రజాపాలన మార్చ్ 21: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గోకవరం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం పొట్నూరి సతీష్ దంపతులుకి రెండున్నర (సంవత్సరాలు) అక్షయ్ రామ్ కి అంతుచిక్కని వ్యాధి బొన్ మేర్ వ్యాధితో బాధపడుతున్నాడు ఆపరేషన్ నిమిత్తం సుమారు 30 లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో. పాలూరు బోసు బాబు పిలుపుమేరకు నిరుపేద కుటుంబాన్నికి భరోసాగా పలు సంఘాలు పలు ట్రస్టు ఉద్యోగస్తులు ఆర్థిక సాయం మేరకు తమిళనాడు చెన్నై వేలూరు హాస్పిటల్ లో వైద్యం పొందుతున్న అక్షయ్ రామ్ చిన్నారికి పరిస్థితి విషయము తెలుసుకున్న కాకినాడ వాస్తవ్యులు. చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు సోము ప్రసాద్. చిన్నారి వైద్యం కోసం 10 వేలు రూ ఆర్థిక సాయం మాజీ జెడ్పిటిసి పాలూరు బోసు బాబు చేతులు మీదగా అందజేశారు వైద్య అనంతరం అక్షయ్ రామ్ స్వగృహానికి క్షేమంగా రావాలని ప్రార్థనలు. పూజలు నిర్వహిస్తున్నారని. మాజీ జెడ్పిటిసి బోసు బాబు తెలిపారు

## దుర్గా దేవి కి డేటా ఎంట్రీ ఆపరేటర్ గా నియామకం

### నియామక పత్రాలు అందజేసిన కలెక్టర్ మాధవి లత




రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి: ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బొమ్మూరు కి చెందిన దుర్గా దేవి తానేటి కి ప్రభుత్వ ఆసుపత్రిలో డేటా ఎంట్రీ ఆపరేటర్ గా నియమిస్తూ నియామక ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా కే. మాధవీలత తెలియచేశారు.మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో దుర్గా దేవిని నియామక పత్రాన్ని కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత చక్కని పనితీరు తో అధికారుల మన్ననలను పొందాలని అభినందనలు తెలిపారు. సిఎం మార్చి ఒకటవ తేదీన నిడదవోలు పర్యటన సందర్భంగా బొమ్మూరు కి చెందిన దుర్గా దేవి సిఎం కి అర్జి ఇవ్వడం జరిగిందని, ఆమేరకు నేడు నియామక ఉత్తర్వులు అందజేసినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా అర్జీ దారు తానేటి దుర్గా దేవి వివరాలు తెలుపుతూ, మార్చి ఒకటిన నిడదవోలు వొచ్చిన ముఖ్యమంత్రి ని కలిసి అర్జీ అందజేసినట్లు తెలిపారు. తన భర్త ఏడిద సబ్ స్టేషన్ నందు 14 సంవత్సరాలు పని చేసి ఎయిడ్స్ వలన బ్రెయిన్ డెడ్ వలన 2017 జూన్ 21 న మరణించడం జరిగిందన్నారు. ఆరోజు నుంచి తిరగని అధికారి లేరు. విద్యుత్ అధికారుల చుట్టూ తిరిగి నా భర్త ఉద్యోగం కోసం ప్రయత్నం చేసినా ఎవ్వరూ కూడా కనీసం నా పరిస్థితి వినలేదన్నరు. విద్యుత్ సంస్థ లో మహిళలకు అవకాశం లేదని తెలియ చేశారు. నాకు ఒక బాబు ఉన్నారు, మేము ఎటువంటి ఆదరణ లేకుండా ఎన్నో ఇబ్బందులు పడుతున్నా అన్నారు. జగనన్న ని కలిస్తే తప్పకుండా సహాయం చేస్తారని కొందరు సలహా ఇవ్వడం తో మార్చి ఒకవటవ తేదీన నిడదవోలు లో సిఎం ని కలువగా, జిల్లా కలెక్టర్ మాధవీలతని కలవాలని జగనన్న చెప్పడం జరిగిందన్నారు. నా అర్జీని చూసిన కలెక్టర్ వెంటనే స్పందించి ప్రభుత్వ ఆసుపత్రిలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, జిల్లా కలెక్టర్ కు దుర్గా దేవి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వికాస్ జిల్లా అధికారి లచ్చా రావు, జిల్లా రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

# గంజాయి ముఠా గుట్టురట్టు



నూజివీడు ప్రజా పాలన ప్రతినిధి:నూజివీడులో గంజాయి ముఠా గుట్టు రట్టయింది. భారీ స్థాయిలో గంజాయి పొడి, కొత్త పందాలు గంజాయి లిక్విడ్ ల స్వాధీనం పెను సంచలనంగా మారింది.ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్దేవ్ శర్మ, నూజివీడు డిఎస్పి ఈ అశోక్ కుమార్ గౌడ్ ఆదేశంతో నూజివీడు రూరల్ సీఐ ఆర్ అంకబాబు, రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ పోలీసు బృందంతో మంగళవారం నాడు విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో నూజివీడు మండలం మర్రిబంధం గ్రామంలోని హొటల్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఏపీ 39 డిడి 19 18 నంబర్ గల బైకుపై ముగ్గురు అనుమానిత వ్యక్తులు పరారవుతుండగా అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుండి 1 కేజీ లిక్విడ్ గంజాయి, 4 కేజీల గంజాయి పొడి, 5 బ్యాంక్ ఏటిఎం కార్డ్స్, మూడు సెల్ ఫోన్లు, 1 బైక్ స్వాధీనం చేసుకున్నట్లు నూతివీడు డిఎస్పి ఈ అశోక్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. నూజివీడు రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో డిఎస్పి అశోక్ కుమార్ గౌడ్ మాట్లాడుతూగుంటూరు జిల్లాకు చెందిన ఏసీ మెకానిక్ షేక్ ఫయాజ్ కు గంజాయి తాగే అలవాటు ఉండగా, ఐదేళ్ల క్రితం విశాఖ జిల్లా హుకుంపేట మండలం నంది వలస గ్రామానికి చెందిన సంతోష్ అనే వ్యక్తి తో పరిచయం ఏర్పడిందన్నారు.కేజీ గంజాయిని 2500 ల రూపాయలకు ఫయాజ్ కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.సంతోష్ సమీప బంధువు తాంగుల బుద్దు తో ఫయాజ్ కు పరిచయం చేయగా,కేజీ లిక్విడ్ గంజాయిని బుద్దు 1.20 లక్షలకు కొనుగోలు చేసి 1.60 లక్షలు గా ఫయాజ్ తో చెప్పడంతో, గంజాయి లిక్విడ్ వ్యాపారం పై వారి దృష్టి మళ్లిందన్నారు. ఈ మేరకు ఆర్ 15 బైక్ పై ఈనెల 15వ తేదీన గుంటూరు నుండి పాడేరు వెళ్లి హొటల్ రూమ్ తీసుకొని, అదే రోజు సాయంత్రం లిక్విడ్ గంజాయిని 1.20 లక్షలకు బేరం ఆడుకున్నట్లు విచారణలో నిందితులు పేర్కొన్నట్లు డి.ఎస్.పి అశోక్ కుమార్ గౌడ్ తెలిపారు.బుద్దు ఫయాజ్ కలసి చెరో రెండు కేజీలు లెక్కన మొత్తం నాలుగు కిలోల గంజాయిని తీసుకొని, బ్యాలెన్స్ ఉన్న 60 వేల రూపాయలు బుద్దు గుంటూరు వస్తే ఇస్తామని తెలిపారు.ఈ ఒప్పందం ప్రకారం ముగ్గురు కలిసి బైకుపై వెళుతుండగా నూజివీడు మండలం మర్రిబంధం గ్రామంలో విశ్వసనీయ సమాచారంతో అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.ఈజీ మనీ, లగ్జరీ లైఫ్ ధ్యేయంగా... విద్యార్థులు, యువత లక్ష్యంగా లిక్విడ్ గంజాయి, గంజాయిపొడులను అమ్మకాలు కొనసాగిస్తున్నట్లు నిందితుల విచారణలో వివరించినట్లు డి.ఎస్.పి అశోక్ కుమార్ గౌడ్ తెలిపారు.రిమాండ్ నిమిత్తం నిందితులను కోర్టుకి హాజరు పరిచినట్లుగా చెప్పారు.చేక చక్యంగా వ్యవహరించి నిందితులను అదుపులోకి తీసుకోవడంలో నేర్పుగా విధులు నిర్వర్తించిన రూరల్ సీఐ ఆర్ అంకబాబు, నూజివీడు రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ లను ఈ సందర్భంగా డిఎస్పి ప్రశంసించారు. ఎస్పీ రివార్డు కోసం సిఫార్సు చేసినట్లుగా తెలిపారు. ఈ కేసులో మరింత లోతుగా విచారణ చేపడుతున్నట్లు డి.ఎస్.పి అశోక్ కుమార్ గౌడ్ వివరిస్తున్నారు. పాత్రికేయుల సమావేశంలో నూజివీడు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్ అంకబాబు, నూజివీడు రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
సంపాదకీయం
బుధవారం 22, మార్చి 2023

# పీవీ ఒక జలాంతర్గామి

మాజీప్రధాని పీవీ నరసింహారావు గురించి నేను ఏ స్థాయిలో మాట్లాడగలను? ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలోఉన్నా, ప్రజా జీవనంలో ఉన్నా నరసింహారావు గారు ఎలా వ్యవహరించారో ప్రజలకు తెలుసు. ఆయన రాజకీయ పరిస్థితుల పట్ల ఏ విధంగా వ్యవహరించారో అన్నదానికన్నా నేను ఆయనను వ్యక్తిగా అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాను. నా స్నేహితుల నుంచీ, వార్తాపత్రికల నుంచీ ఆయన కొన్ని ముఖ్యమైన అంశాలపై ఏ విధంగా ప్రతిస్పందించాలో తెలుసుకునే ప్రయత్నంచేశాను. ఆయన ఆకర్షణ గల నాయకుడు కాదని అందరికీ తెలుసు. పీవీ ఒక విస్తృత అధ్యయనశీలి. ఆయన తన చుట్టూ ఉన్న అంశాలను అధ్యయనం చేశారు. చరిత్రను, నాగరికతను అధ్యయనం చేశారు. తత్వశాస్త్ర గ్రంథాలను అధ్యయనం చేశారు. అన్నిటికంటే ముఖ్యంగా ఆయన ప్రజలను అధ్యయనం చేశారు. తనకొక అభిప్రాయం ఉన్నప్పటికీ ఆయన పెద్దగా తన అభిప్రాయాలను వ్యక్తంచేసేవారు కాదు. ఆయన మౌనంగా ఉండడం ద్వారా మౌనిలా కనిపించేవారు. తనను ఒక నిశ్శబ్ద వ్యక్తిగా నిర్మించుకున్నారు. అన్నిటి గురించీ మాట్లాడుతూ తాను అంతటా కనిపించాలని అనుకునేవారు కాదు. అందరూ నిద్రిస్తున్న సమయంలో రాత్రికి రాత్రి ఎదిగిన వ్యక్తి కాదు ఆయన. ఆయన ఒక జలాంతర్గామి. తనను తాను కాలంతో పాటు మౌనంగా నిర్మించుకున్న వ్యక్తి.పీవీ నరసింహారావు తన కాలం కోసం తాను ఆయన ఎదురు చూసేవారేమో అని నా అభిప్రాయం. తనకు తాను సన్నద్ధం చేసుకునే క్రమంలో పీవీ తన శక్తిని కాపాడుకునేవారు. అనవసరంగా వ్యాఖ్యానించేవారు కాదు. సరైన సమయం కోసం ఆయన నిరీక్షించారు. ఆయన వ్యక్తుల గురించి, రాజకీయ పరిణామాల గురించి, తనకెదురైన కొన్ని పరిస్థితుల గురించి వెంటనే ప్రతిస్పందించి తన అభిప్రాయం చెప్పకూడదనే కళను అభ్యసించారు. తన అభిప్రాయం ఎవరూ అడగకుండా స్పందించేవారు కాదు. తాను మాట్లాడే తరుణం గురించి వేచి చూసేవారు.ప్రాచీనమైన నాగరికత గల భారతదేశం ఎలా పనిచేస్తుందన్న విషయంలో ఆయనకు స్పష్టమైన అభిప్రాయాలు ఉన్నాయి. ఏడు దశాబ్దాల వలస పాలన తర్వాత దేశాన్ని రాత్రికి రాత్రి మార్చడం సాధ్యమా? ప్రస్తుత రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితుల్లో సంస్కరణలు ప్రవేశపెట్టగలమా అన్న విషయంలో ఆయనకు స్పష్టమైన అవగాహన ఉండేది. కాని ఆయన తన ఆలోచనలను అమలు చేసే సమయం కోసం వేచి చూశారు. తనకు అధికారం వచ్చిన తర్వాత తగిన చర్యలు తీసుకున్నారు. తాను ప్రధానమంత్రి పదవి చేపట్టాలని పిలుపు వచ్చినప్పుడు ఆయన ఆలోచనలను వేగంగా అమలు చేశారు. ఇవాళ మనం వాటిని విప్లవాత్మకమైనవని పిలుస్తున్నాం. టెలికాం, విమానయానం, రహదారులు, అంతరిక్షం, ఐటీ మొదలైన అనేక రంగాల్లో ఏ చర్యలు తీసుకోవాలో, ఎప్పుడు తీసుకోవాలో, ఎలా తీసుకోవాలో ఆయనకు స్పష్టత ముందే ఉండేది.ఒక ప్రధానమంత్రిగా ఆయన వ్యవహరించిన తీరే ఆయన ఎంత ప్రగాఢంగా ఆలోచించే వ్యక్తో చెప్పడానికి ఒక కొలమానం. పీవీ ఒక అంతర్ముఖుడిగా ఉండే కళను దీక్షగా అభ్యసించారు. ఆయనలో ఉన్న మరో ముఖ్య లక్షణం ఆయనకు ఎవరిని నమ్మాలో, విశ్వసించాలో తెలుసు. అందుకే మన్మోహన్ సింగ్‌ను ఎంచుకున్నారు. మన్మోహన్ సింగ్ ఆయన గురించి ఏమన్నారో నేను తెలుసుకునే ప్రయత్నం చేశాను. పీవీకి తానేమి చేయాలో అన్న విషయంలో స్పష్టత ఉన్నదని అంటూనే 'సారంలో పీవీ సన్యాసి' అని మన్మోహన్ సింగ్ ముగించారు. కాని పీవీకి తానెప్పుడు అదృశ్యం కావాలో నేర్చుకున్నవ్యక్తి అని నాకు అనిపిస్తుంది. పీవీ తన వ్యక్తిత్వం పెద్దగా ప్రదర్శించకుండా చూసుకోవడంలో దిట్ట అని నా అభిప్రాయం. ఒక వ్యక్తి ఒక గదిలోకి ప్రవేశిస్తే అతడు ఎలా వ్యవహరిస్తాడు, ఉన్నంతసేపు ఎలా మాట్లాడతాడు, ఎలా ప్రతిస్పందిస్తాడు మనకు అర్థమవుతుంది. కాని పీవీ తన వ్యక్తిత్వం ఏమిటో అన్నది తెలిసేలా కాకుండా, తానేమి చేశానో అని మనకు అర్థమయ్యేలా వ్యక్తిత్వాన్ని రూపొందించుకున్నారు. అందుకే ఆయన అమలుచేసిన విస్తృతమైన సంస్కరణలను గుర్తుకు తెచ్చుకోవడానికి మనకు ఇంతకాలం పట్టింది.పీవీ మాటలు వింటే ఆ సమయంలో ఒక అద్భుత ప్రసంగం అనిపించకపోవచ్చు, ఎంత బాగా మాట్లాడారు అని చెప్పలేకపోవచ్చు. కాని ఆ ప్రసంగం అర్థం చేసుకోవడానికి సమయం పడుతుంది. తన వ్యక్తిత్వాన్ని తన చర్యలకు అడ్డంకి కాకుండా ఆయన చూసుకున్నారు. తన వ్యక్తిత్వం అపోహలకు దారితీయకుండా తానెలా ప్రవర్తిస్తారు, ఎలా మాట్లాడతారు అన్న అంశాలపై మన దృష్టి మళ్లకుండా చూసుకున్నారు. ఇది ఎంతో అసాధారణమైన పరిపక్వమైన వ్యవహార శైలి.పీవీ తన కాలంలో ప్రదర్శించిన మేధస్సు మనకంటే ఒక తరానికి ముందుంది. తన సమకాలీనులకంటే ఒక తరం ముందుగా ఆయన యోచించారు. ఎవరూ చెప్పని అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేసేవారు, ఆయన గొప్ప దేశభక్తుడు, ఒక ప్రగాఢమైన ఆధ్యాత్మికత, ప్రగాఢమైన దేశభక్తి గలవారు కనుకే తన ఆలోచనలను రాత్రికి రాత్రి అమలు చేశారు. మన్మోహన్ సింగ్ ఆయనను ఒక మహర్షి అని అభివర్ణించారు. కాని ఏది అంతిమంగా నిలుస్తుందో, ఏది అంతిమంగా నిలుస్తుందో పీవీకి తెలుసునని మనం విశ్లేషించవచ్చు. తన వ్యక్తిత్వం నిలిచిపోయేలా కాక, తాను చేపట్టిన సంస్కరణలు అంతిమంగా నిలిచిపోయేలా చేశారు. ఇది పీవీలో ఉన్న మానవ లక్షణం. నరసింహారావు గురించి ఆయన సన్నిహిత స్నేహితుడి నుంచి నేను తెలుసుకున్నాను. ఆయన ఇంటర్మీడియట్‌లో నాకు సహాధ్యాయి. ఆయన సోదరుడు పీవీ నరసింహారావు కూతురుని వివాహం చేసుకున్నారు. మేము ఆయన రాజకీయ వ్యక్తిత్వం గురించి లేదా స్వంత వ్యక్తిత్వం గురించి చర్చించుకునేవారం. పీవీ నరసింహారావు లాంటి వ్యక్తులను శ్రేష్టులు అని మనం భావించాలి. 'యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్త దేవేతరో జనః' అన్నట్లు పీవీ లాంటి శ్రేష్టులు చేపట్టే మార్గాన్ని ప్రజలు అనుసరిస్తారు. వారు తమ ముద్రను వర్తమాన ప్రపంచంలో బలంగా వేసి వెళ్లిపోతారు. ఈ ట్విట్టర్, ఎస్ఎమ్మెస్‌ల ప్రపంచంలో ఎవరూ ఏమి చెప్పకముందే మనం ఒక అభిప్రాయాన్ని ఏర్పర్చుకుంటాం. మనం ఒక పదం మాట్లాడకముందే అది అంతటా పయనిస్తుంది, అందువల్ల మాట్లాడడంలో సంయమనం అనేది ప్రస్తుతం అత్యవసరం. ప్రతిదానిపై ఒక అభిప్రాయం ఇవ్వడం అవసరమా? మాట్లాడడంలో సంయమనం పాటించడం ద్వారా ప్రజా జీవనాన్ని ఏ విధంగా కొనసాగించాలన్న విషయంలో పీవీ నరసింహారావు మనకు మార్గదర్శకంగా నిలిచారు.

# కాంగ్రెస్ : బీజేపీ రహస్య భాగస్వామి!



భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటినుంచీ ఆ పార్టీకి ఒక రహస్య మిత్రపక్షం ఉన్నది. అది భారత జాతీయ కాంగ్రెస్. ఈ భాగస్వామ్యం ప్రత్యక్షమైనది కాదు, అంతర్గతమైనది మాత్రమే. బీజేపీ చెప్పిన, చేసిన ప్రతీదాన్నీ కాంగ్రెస్ విమర్శిస్తోంది. కార్యాచరణకు వచ్చేటప్పటికి మౌనంగా బీజేపీని బలపరుస్తోంది. లోక్‌సభ, శాసనసభ ఎన్నికలలో బీజేపీకి వ్యతిరేకంగా కలసికట్టుగా పోరాడేందుకు వివిధ విపక్షాల నాయకులు ప్రయత్నించినప్పుడల్లా కాంగ్రెస్ ఆ ప్రయత్నాలను వమ్ము చేస్తోంది. బహుశా, అనుద్దేశపూర్వకంగానే రెండు రాజకీయ తప్పుల ద్వారా కాంగ్రెస్ పరోక్షంగా బీజేపీకి తోడ్పడుతోంది.

మొదటిది.- ఏదైనా ఒక రాష్ట్రంలో తన ప్రాబల్య స్థానాన్ని ఏ పార్టీ అయినా కైవసం చేసుకుంటే దానిపట్ల కాంగ్రెస్ తీవ్ర విముఖత చూపుతోంది. ఇందుకొక ఉదాహరణ ఆమ్ ఆద్మీ పార్టీ. ఢిల్లీలో ఎనిమిది సంవత్సరాలుగా ఆప్‌ను తన ప్రత్యర్థిగా కాంగ్రెస్ భావిస్తోంది. పంజాబ్‌లో సైతం ఆప్ అధికారానికి వచ్చినప్పటి నుంచీ కాంగ్రెస్ ఆ పార్టీ పట్ల మరింత వ్యతిరేకత వ్యక్తం చేస్తోంది. ఇక రెండో తప్పు ప్రధానమంత్రి పదవిని కాంగ్రెస్ తన జన్మహక్కుగా భావిస్తోంది. ఈ కారణంగానే బీజేపీ వ్యతిరేక కూటమి ఏర్పాటును ప్రతిపాదిస్తున్న ఏ ప్రతిపక్ష నేత పట్ల కాంగ్రెస్ సానుకూల వైఖరి చూపడం లేదు. ప్రధానమంత్రి పదవిపై తన హక్కును సదరు నేత నిరాకరిస్తున్నట్టుగా కాంగ్రెస్ అనుమానిస్తోంది. కాంగ్రెస్ మొదటి తప్పును 2017లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలలో చేసింది. ఆ ఎన్నికలలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునేందుకు ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సంసిద్ధమయ్యారు. మిత్ర పక్షంగా ఉండడానికే కాదు, తనకు కేటాయించిన నియోజకవర్గాలలో తమ పార్టీ అభ్యర్థులను సైతం ఎంపిక చేసే స్వేచ్ఛను కాంగ్రెస్‌కు ఇచ్చేందుకు కేజ్రీవాల్ సిద్ధమయ్యారు. ఆ ఎన్నికలలో బీజేపీకి 99 రాగా, కాంగ్రెస్‌కు 77 సీట్లు వచ్చాయి. కాంగ్రెస్-ఆప్ కలసికట్టుగా పోటీ చేసి ఉంటే బీజేపీని అధికారం నుంచి కూలదోసేందుకు అవసరమైన మెజారిటీని సాధించి ఉండేవి. ఇది జరిగినట్లయితే నరేంద్ర మోదీ- అమిత్ షా రాజకీయ బలం గుజరాత్‌లో మాత్రమే కాకుండా దేశ వ్యాప్తంగా కూడా బలహీనపడేది.బీజేపీకి వ్యతిరేకంగా ఏ ప్రతిపక్ష కూటమి అయినా కాంగ్రెస్ నాయకత్వంలో మాత్రమే ఏర్పడాలని, 2024 సార్వత్రిక ఎన్నికలలో విజయం సాధించిన పక్షంలో ప్రధానమంత్రి పదవిని చేపట్టే హక్కు స్వతస్సిద్ధంగా తమ పార్టీకే ఉండితీరాలని కాంగ్రెస్ నాయకులు పదేపదే ప్రకటిస్తున్నారు. ఇది కాంగ్రెస్ రెండో తప్పు. కాంగ్రెస్ మాత్రమే విపక్ష కూటమికి నాయకత్వం వహించాలని, ప్రధానమంత్రి పదవి తమ పార్టీకే దక్కాలనే ఉబలాటం తమకు లేదనే విషయాన్ని సోనియా గాంధీ, రాహుల్ గాంధీ స్పష్టంగా ప్రకటించడం లేదు. ఈ విషయమై ఇరువురూ మౌనం వహిస్తున్నారు. ఆ మౌనాన్ని బీజేపీ అధికార ప్రతినిధులు తమ పార్టీకి అనుకూలంగా ఉపయోగించుకుంటున్నారు. ఏ విపక్ష నేత అయినా ప్రతిపక్షాల ఐక్యత గురించి మాట్లాడితే ఆ నాయకుడు ప్రధానమంత్రి పదవిని ఆకాంక్షిస్తున్నాడని బీజేపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. దీంతో కాంగ్రెస్ వర్గాలు ఆ ప్రతిపక్ష నేత ఉద్దేశాలను శంకిస్తున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ విజయం, ప్రతిపక్షాల మధ్య అనైక్యత వల్లే సాధ్యమయిందన్న సత్యాన్ని కాంగ్రెస్ అర్థం చేసుకుందా? లేదు. కాంగ్రెస్ చొరవతో ప్రతిపక్షాల సమావేశాలు తరచు జరుగుతున్నాయి. అయినప్పటికీ భావి సంకీర్ణ ప్రభుత్వానికి ఎవరు నాయకత్వం వహించాలన్న ప్రశ్నకు సమాధానం లభించడం లేదు.రాహుల్ గాంధీ ఇటీవల తన స్ఫూర్తిదాయక భారత్ జోడో యాత్రలో రాజకీయ ఎత్తుగడలు, వ్యూహాల గురించి చర్చించేందుకు తిరస్కరించారు. ప్రజాసమస్యల గురించి మాత్రమే మాట్లాడారు. ప్రజల అభిప్రాయాలను విన్నారు. తద్వారా బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల సమైక్యతకు అవసరమైన ఒక విధాన వేదికను సృష్టించడంలో ఆయన సఫలమయ్యారు. అయినప్పటికీ 2024 సార్వత్రిక ఎన్నికలలో విజయం సాధించి, అధికారానికి వచ్చే సంకీర్ణానికి సారథ్యం వహించేదెవరు అన్న ప్రశ్నకు సమాధానం లభించలేదు. ఎన్నికల అనంతరం మాత్రమే ఆ ప్రశ్న తలెత్తడానికి ఆస్కారమున్నదని మాత్రమే దీని అర్థం. ప్రతిపాదిత కూటమి బీజేపీని ఓడించగలిగితేనే కొత్త ప్రభుత్వ సారథి ఎవరని ఆలోచించవలసి ఉంటుంది. అప్పటివరకు అది ఊహాగానమే అన్నమాట.ప్రతిపాదిత ప్రతిపక్ష కూటమి నాయకత్వ బాధ్యతలు తనకే ఇవ్వాలనే డిమాండ్‌ను కాంగ్రెస్ త్యజించి, ఓటర్ల తీర్పు వచ్చే వరకు వేచివుంటానని రాయ్‌పూర్ ప్లీనరీలో కాంగ్రెస్ ప్రకటించి ఉండాల్సింది. 2019 సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్‌కు 19.46 శాతం ఓట్లు వచ్చాయి. ఆ తరువాత స్థానంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్‌కు 4.06 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. కనుక తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం కాంగ్రెస్‌కు మాత్రమే ఉంటుంది. 2024లో బీజేపీని ఓడించేందుకు అన్ని రాజకీయ పక్షాలతోను లేదా భావసారూప్యత గల పార్టీలతోనూ కలిసి పనిచేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని రాయపూర్ ప్లీనరీలో కాంగ్రెస్ ప్రకటించి ఉన్నట్లయితే విపక్షాల ఐక్యతకు సానుకూల పరిస్థితులు మరింతగా నెలకొని వుండేవి. కానీ అలా జరగలేదు. 'సమానుల మధ్య ప్రథముడు' స్థానం తనకే దక్కాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. సోనియా గాంధీ తన ఉపన్యాసంలో దేశానికి స్వాతంత్ర్యం సాధించింది కాంగ్రెస్ పార్టీయేనని, రాజ్యాంగాన్ని సంరక్షించే బాధ్యత తమపైనే ఉందని ఉద్ఘాటించారు. అయితే లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ ఓట్ల శాతం 2009లో 29 శాతం నుంచి 2019లో 19 శాతానికి పడిపోగా బీజేపీ ఓట్ల శాతం అదే కాలంలో 18.8 నుంచి 37 శాతానికి పెరిగింది. ఈ నేపథ్యంలో భారత ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే బాధ్యతను తాము ఎలా నిర్వర్తించనున్నదీ ఆమె చెప్పనేలేదు. సోనియా తన ప్రసంగంలో 'ప్రతిపక్షం' అన్న మాటను ఒక్కసారి కూడా ప్రస్తావించలేదు. కొత్త అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తన అధ్యక్షోపన్యాసంలో సంకీర్ణ పాలనకు 'యూపీఏ నమూనా' ఆదర్శప్రాయమైనదని, కాంగ్రెస్‌తో నిమిత్తం లేకుండా 'తృతీయ శక్తి' ఏదైనా ప్రభవిస్తే అది బీజేపీకి మాత్రమే లబ్ధి సమకూరుస్తుందని హెచ్చరించారు. ఈ దృష్ట్యా 'ప్రతిపక్షం' గురించి ప్రస్తావించకపోవడంలో సోనియా ఉద్దేశమేమిటో తేటతెల్లమవుతోంది.మోదీ సర్కార్ ఆధ్వర్యంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోనియాను 12 గంటల పాటు, రాహుల్ గాంధీని 60 గంటల పాటు ప్రశ్నించింది. తల్లీ తనయులను జైలుకు పంపించేందుకు అవసరమైన సాక్ష్యాధారాలను కనుగొనేందుకు ఈడీ శతథా ప్రయత్నించింది. నరేంద్రమోదీ ఆరునూరైనా సరే భారత ప్రధానమంత్రిగా కొనసాగేందుకు కృతనిశ్చయంతో ఉన్నారని, 2024లో బీజేపీ విజయం కోసం ఎటువంటి చర్యలకైనా సిద్ధపడ్డారని సోనియా అర్థం చేసుకున్నట్టు లేదు. ప్రధానమంత్రిగా కొనసాగేందుకు నరేంద్రమోదీ ఎందుకు అంత కృతనిశ్చయంతో ఉన్నారన్న విషయాన్ని కూడా కాంగ్రెస్ నాయకులు తరచిచూడడం లేదు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ ఓడిపోయిన పక్షంలో 2002 గుజరాత్ మారణకాండకు సంబంధించి తనపై ఉన్న ఆరోపణలపై మళ్లీ తప్పక విచారణ జరుగుతుందని, శిక్షపడే అవకాశం కూడా ఉందని మోదీ అనుమానం. కనుక ఎట్టి పరిస్థితులలోనూ బీజేపీ ఓడిపోకూడదు. అయితే తమ పాలనపై ప్రజలలో వ్యతిరేకత ప్రబలుతోందని కూడా మోదీ, అమిత్ షాలకు తెలుసు. దీనికితోడు ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ ఇటీవలికాలంలో విభిన్న సందర్భాలలో మోదీ ప్రభుత్వం భారతీయ ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేషాన్ని వ్యాపింపచేస్తున్నదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వాస్తవాల దృష్ట్యా సంఘ్ పరివార్ హిందూ రాష్ట్ర ఏర్పాటు స్వప్నాన్ని సాకారం చేసేందుకు తోడ్పడడంపైనే బీజేపీకి తన నాయకత్వం కొనసాగడమనేది ఆధారపడి ఉందన్న విషయం నరేంద్ర మోదీకి బాగా తెలుసు. కనుకనే 2024 సార్వత్రిక ఎన్నికలలో గెలిచేందుకు ప్రతిపక్షాలలో చీలికలు సృష్టించేందుకు, విపక్ష పార్టీల నాయకులను అవినీతి ఆరోపణలతో అప్రతిష్ఠ పాలు చేసేందుకు మోదీ సంకల్పించుకున్నారు. మోదీ తన మొదటి హయాంలో సిబిఐ, ఎన్ఐఏ, ఢిల్లీ పోలీస్‌లను ఉపయోగించుకున్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత మోదీ ప్రభుత్వం ఈడీపై ఆధారపడుతోంది. ప్రతిపక్షాలపై ముమ్మర దాడులకు రంగాన్ని సిద్ధం చేసేందుకే తొలుత 2019లోనే 'మనీ లాండరింగ్ నిరోధక చట్టం' (పిఎమ్ఎల్ఎ) ఎనిమిది సవరణలు చేశారు. ఆ సవరణలు ఈడీకి అపరిమిత అధికారాలను కల్పించాయి. ఈ చట్టాన్ని ఉపయోగించుకుని ప్రతిపక్ష నాయకులను అవినీతిపరులుగా, పేదలకు వ్యతిరేకులుగా అప్రతిష్ఠ పాలు చేసేందుకు మోదీ సర్కార్ ప్రయత్నిస్తోంది. చట్టబద్ధులుగా ఉండే పౌరులు రాజకీయ నాయకులలో విశ్వాసాన్ని కోల్పోయేలా చేసి, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను అప్రతిష్ఠ పాలు చేసి, 2024 ఎన్నికల అనంతరం హిందూ రాష్ట్ర రూపేణా నియంతృత్వ పాలన నెలకొల్పేందుకు దారిని సుగమం చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ముఖ్యమంత్రులకు వ్యతిరేకంగా గవర్నర్లను ఉసిగొల్పడం, ఎన్నికల సంఘం స్వతంత్ర ప్రతిపత్తిని బలహీన పరచడం మొదలైన చర్యలన్నీ ఆ లక్ష్య సాధన కోసమే. దేశ పరిపాలన నిరంకుశత్వం దిశగా సాగుతోందని ప్రజలకు విస్పష్టంగా చెప్పేందుకు రాయ పూర్ కాంగ్రెస్ ప్లీనరీ ఒక మహదవకాశం కల్పించింది. అయితే కాంగ్రెస్ నాయకులు దానిని సద్వినియోగపరచుకోలేదు. ఆ సత్యాన్ని ఎలుగెత్తి చాటేందుకు ప్రతిపక్షాలతో కలిసి మరొక అవకాశాన్ని కల్పించుకోవాలి. ఇది తక్షణమే జరగవలసిన పని.

# అబద్ధం

బహుశా
ఇప్పుడు అబద్ధం అర్థం మార్చేసుకుంది
ఎవరూ తమ పిల్లలకు హరిశ్చంద్ర పేరు పెట్టడంలేదు
ఒకప్పుడు కనీసం కనబడేదైనా నిజమనిపించేది
మాటలు, చేతలు, దృశ్యాలు
అన్నింటినీ అబద్ధం కమ్మేసింది
వాడో వాగ్దానాన్ని గాల్లో విసురుతాడు
అది గాల్లో ఉండగానే వెనక్కి లాక్కొని వాడే మింగుతాడు
వీడో నిర్మాణాన్నీ కళ్ళముందు రూపుగడతాడు
కలలే కదా!
ధ్వంసమవ్వడానికి సమయమవసరం లేదు
మనుషుల మధ్య
బంధాలవ్వాల్సిన మాటలు
బాధ్యతలవ్వాల్సిన మాటలు
నమ్మకాలవ్వాల్సిన మాటలు
పలచబడి తేలిపోతున్నాయి
మాట బయటకు రాకుండానే
అక్షరాలు కత్తెర్లకు బలవుతున్నాయి
పదాలు అర్థాలను వలిచేసుకొని
విపరీతార్థాల నగత్వంతో ఊరేగుతున్నాయి




మాటకు పూసిన పైపూత
క్షణాల్లో కరిగిపోయినా
నిజం చెప్పులేసుకోవడం
ఓ జీవితకాలం ఆలస్యమవుతోంది
ముక్కలు ముక్కలుగా అతుకులేసుకున్న దృశ్యాలు
నిజాలమీద నిప్పులు పోసి
చలికాసుకుంటున్నాయి
మేకప్పుల కప్పులతో మూసుకుపోయిన శరీరాలు
ఎవరికీ తమ లోపలి దేహాల్ని చూపడంలేదు
నిజం నీడల్లో సేదదీరాల్సిన నువ్వు
అబద్ధపు గాడ్పులే వాసంత సమీరాలనుకోవడమే
అతి పెద్ద విషాదం
ఎవరినైనా నమ్మించడం పెద్ద విషయమేమీ కాదు
కొనసాగించడమే అత్యంత క్లిష్టతరం
ఒక్కసారి నమ్మకం కోల్పోయాక
కట్టుకున్న అబద్ధపు మేడలన్నీ కుప్పకులాల్సిందే !

- బండ్ల మాధవరావు

## అసెంబ్లీలో తెదేపా సభ్యుల తీరు సభకు తలవంపులు: వైకాపా నాయకులు



గోకవరం ప్రజాపాలన మార్చ్ 21 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తెదేపా సభ్యుల తీరు సభకు తలవంపులు తీసుకువచ్చేలా ఉన్నాయని వైకాపా నాయకులు ఆరోపించారు. సోమవారం గోకవరం మండల కేంద్రంలోని స్థానిక దేవిచౌక్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి వైకపా దళిత నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు గుల్లా ఏడుకొండలు, వరసాల ప్రసాద్ మాట్లాడుతూ ఏపీ అసెంబ్లీ సాక్షిగా తెదేపా ఎమ్మెల్యేలు జీవో నెంబరు 1 పేపర్లను ముక్కలు ముక్కలుగా చించి సభాపతి స్పీకర్ పై విసిరి కొట్టడంతో పాటు దళిత ఎమ్మెల్యే సుధాకర్ బాబు పై తేదేపా ఎమ్మెల్యేలు దాడి చేయడం దారుణమైన సంఘటన అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు వరసాల ప్రసాద్ , గుల్లా ఏడుకొండలు, బిజ్జి రాజు, మచ్చ మోహన్ , మచ్చ జయలక్ష్మి , మందపాటి సతీష్ కుమార్, జక్కల వెంకన్న , కొండేటి పాపారావు , నేతల నిల, మచ్చ మురళి, మడతల రమేష్ , వజరిగి మురళి , మచ్చ బుజ్జి, నల్లి బుజ్జి , గొల్లి చిన్ని , దండంగి వీరబాబు, గేడం అరుణకుమార్, బరకటి రాజు, వందవాసి జయరాజు , నరిసెట్టి రామకృష్ణ, ఆకాశపు సన్నీ , మగపు ఇమ్మానీలు , పిల్లి హర్ష , నేతాల చిరంజీవి , కిరణ్ కుమార్ , నగేష్ , పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన నీరు పొందడం అందరి హక్కు



రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి:ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ ఏటా మార్చి 22వ తేదీన ప్రపంచ నీటి దినోత్సవం జరుపుకుంటారు. ఈ సందర్భంగా మంగళవారం నాడు తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నందు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఏ. గాయత్రి హాజరయ్యి ప్రపంచ నీటి దినోత్సవ ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. నీటి వనరులను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. నీటిని వృధా చేయరాదని, నీటిని కలుషితం చేయకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ పౌరులకు అందించిన ప్రాముఖ్యమైన హక్కు జీవించే హక్కు. స్వచ్ఛమైన గాలి, స్వచ్ఛమైన నీరు పొందడం కూడా ఈ హక్కులో భాగమే అని వివరించారు. ప్రకృతి వనరులు, అడవులు, సరస్సులు, నదులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని భారత రాజ్యాంగ 51(ఏ) అధికరణ తెలియజేస్తుందని అన్నారు. నీటి వనరుల సంరక్షణ సంబంధిత కేసులలో గౌరవ సుప్రీం కోర్టు వారు ఇచ్చిన పలు చారిత్రక తీర్పుల గురించి తెలియజేశారు. ఈ సదస్సులో పాల్గొన్న సంబంధిత అధికారులు నీటి కాలుష్యానికి గల ముఖ్య కారణాల గురించి వివరిస్తూ కాలుష్యాన్ని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ, వ్యవసాయ, భూగర్భ జల, నీటి పారుదల, గ్రామీణ నీటి సరఫరా విభాగాల అధికారులు, వివిధ ఎన్.జి.వో ల వారు, వార్డు సెక్రెటరీలు, వార్డు వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

## హైస్కూలులో గోరుముద్ద కార్యక్రమాన్ని ప్రారంభించిన జడ్పిటిసి గన్నవరపు శ్రీనివాసరావు



అయినవిల్లి మార్చి 21 ప్రజాపాలన ప్రతినిధి :అంబేద్కర్ కోనసీమ పి. గన్నవరం నియోజకవర్గమైన అయినవిల్లి మండలం నేదునూరు జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ నందు ఈరోజు జగనన్న గోరుముద్ద కార్యక్రమం భాగంలో జడ్పిటిసి గన్నవరపు శ్రీనివాసరావు రాగి సంగటి పంపిణీ చేశారు.మంగళవారం అయినవిల్లి మండలం నేదునూరు జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ కు జెడ్పిటిసి శ్రీనివాసరావు విచ్చేసి జగనన్న గోరుముద్ద భాగంలో రాగి సంగటి పంపిణీ కార్యక్రమమును ప్రారంభించినారు.ముఖ్య అతిథిగా ఎంపీపీ శ్రీమతి మట్టపర్తి నాగ విజయలక్ష్మి వెంకటరమణ స్థానిక సర్పంచ్ గుమ్మడి ప్రసాద్ సొసైటీ అధ్యక్షులు చిలువూరు సాయిరాజ్, బొంతు సత్తిబాబు , హై స్కూల్ చైర్మన్ పెనుమల వెంకటరమణ, కనుమూరి సత్యనారాయణ రాజు , కామన్ కృష్ణమూర్తిగారు తరిపట్ల ప్రకాష్ రావు , కడలి శ్రీనివాస్ , జంగ వెంకటరమణ , నెల్లి కనకారావు , బుడితి చంద్రబాబు , కన్వీనర్ కుడుపూడి సత్యనారాయణ , తిప్పా చైతన్య ,బోలాపండు బోల జాను , నెంబర్ అయితా బత్తుల రాజశేఖర్ తరపట్ల శ్రీనివాస్ గారు వస్తా రామారావు, మరియు గ్రామ పెద్దలు వైయస్సార్ కుటుంబ సభ్యులు హై స్కూల్ హెచ్ఎం మరియు హై స్కూల్ స్టాఫ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మహిళ గర్భిణీ అయినప్పటి నుంచి పిల్లలు ఉన్న స్థాయి వచ్చే వరకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అందించడం గొప్ప విషయం

## పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లో తేటి

పల్నాడు జిల్లా. నరసరావుపేట. మార్చి 21 (ప్రజా పాలన ప్రతినిధి,) తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం వర్చువల్ విధానం ద్వారా జగనన్న గోరుముద్దలో మరో పోషకాహారం అందించడంలో భాగంగా బడిపిల్లలకు ఉదయం పూట రాగిజావ అందించే కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఒకటి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు సంబంధించి 44 వేల392 పాఠశాలలలో సుమారుగా 38 లక్షల మంది విద్యార్థులకు సంవత్సరానికి 1910 కోట్ల రూపాయలు వెచ్చించడం జరుగుతున్నది అన్నారు. సత్య సాయి సేవ సెంట్రల్ ట్రస్ట్ సౌజన్యంతో ఈ కార్యక్రమం చేపట్టడం గొప్ప విషయం అన్నారు. సత్యసాయి సేవ ట్రస్టు 42 కోట్లు ఖర్చు చేయనుండగా రాష్ట్ర ప్రభుత్వం 46 కోట్లు జత చేసి మొత్తం 86 కోట్లతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. గోరుముద్ద కార్యక్రమం ద్వారా భోజనం మెనూలో మార్పులు చేసి రోజుకో విధమైన ఆహారాన్ని అందించడం జరుగుతున్నదని అదేవిధంగా వారంలో చిక్కీలు మూడు రోజులు నూతనంగా ఈరోజు నుంచి రాగి జావ మూడు రోజులు అందించడం జరుగుతుందన్నారు. నరసరావుపేట మున్సిపల్ బాలికొన్నతో పాఠశాల నుండి వర్చువల్ విధానాల్లో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి తో మాట్లాడుతూ జిల్లాలో 77, 494 మంది విద్యార్థులను ఉండగా అందులో43,219 నంది విద్యార్థినులు రక్తహీనతగా ఉన్నదని గుర్తించడం జరిగిందన్నారు అందులో మైల్డ్ గా రక్తహీనత ఉన్నవాళ్లు18022, మోడరేట్ గా ఉన్నవాళ్లు 24,893 మంది ఉండగా రక్తహీనత ఎక్కువగా ఉన్నవాళ్లు 304 మంది ఉన్నారని వివరించారు. జగనన్న గోరుముద్ద ద్వారా అందిస్తున్న రాగి జావా వల్ల



రక్తహీనతను జిల్లాలో 9 శాతానికి దిగవచ్చేందుకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సాయి శ్రీకర్ తల్లి కాంచన మాట్లాడుతూ తన బిడ్డ శంకర్భారతిపురం హైస్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడని బిడ్డకు సంబంధించి చదువుకోడానికి పుస్తకాలు, బ్యాగు, యూనిఫామ్ బట్టలు, మరియు బూట్లు వంటివి అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్, పిడి డిఆర్డిఏ బాలు నాయక్, మండల విద్యాశాఖ అధికారి జ్యోతి కిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సులేఖ తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై లైంగిక దాడిని కచ్చితంగా ఖండించాల్సిందే



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : పదేళ్ల బాలికపై లైంగిక దాడి చేయడం అనేది కచ్చితంగా అందరూ ఖండించాల్సిన విషయమే, అందులో ఎటువంటి రాజీ లేదు, చట్టపరంగా ఇందులో ఎవరు ఉన్నా చర్యలు తీసుకోవాల్సిందే మేము కూడా డిమాండ్ చేస్తున్నాం.ఇదే సందర్భంలో ఈ కేసుని అడ్డుపెట్టుకుని న్యాయవాది భగవాన్ చేస్తున్న రాద్ధాంతం గురించి ప్రజలందరికీ తెలియజేయవలసిన ఆవశ్యకత ఉంది, తమ కుమార్తె పై లైంగిక దాడి చేశారని కారణంతో ఓ కుటుంబం పై న్యాయవాది భగవాన్ కుటుంబ సభ్యులు మారణాయుధాలతో దాడి చేయడం అనేది,ఎంతవరకు సమంజసం. చట్టం చదివిన వారే, న్యాయవాది వృత్తిలో ఉండి,ఈ విధంగా మారణాయుధాలతో దాడి చేసి, చట్టాన్ని తన చేతిలోకి తీసుకుని, దాడి చేసి తీవ్రంగా గాయపరచడం అనేది సమంజిసమెనా, ఇది న్యాయవాదులు సమర్థిస్తారా. దిశా చట్టం అనేది రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది, బాలికల విషయంలో ఫోక్సో కేసుని నమోదు చేసి ఎవరైతే లైంగిక దాడి చేస్తారో, వారిపై చర్యలు చేపట్టడం అనేది, ఇదే భవానిపురం స్టేషన్లో కఠినంగా చర్యలు తీసుకున్న చరిత్ర ఉంది.ఇక్కడ ఎవరైనా సరే బాలికలపై మహిళలపై లైంగిక దాడి చేస్తే, అట్టి వారిపై చర్యలు అనేది ప్రభుత్వం సీరియస్ గా పరిగనేస్తోంది, ఇందులో ఎటువంటి అనుమానాలకు తావులేదు, కచ్చితంగా బాలికపై లైంగిక దాడిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము, ఈ కేసులో దిశ పోలీసులు కేసు నమోదు చేసి, ఫోక్సోచట్టం కిందకు వచ్చే విధంగా కేసు నమోదు చేస్తారు. ఈ అవగాహన సైతం లేకుండా కేవలం,భవానిపురం సిఐ ఎండి ఉమర్, ని లక్ష్యంగా చేసుకుని ఈ విధంగా రాద్ధాంతం చేసి, లిఉమర్లి పై ఏదో ఒక రకంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేయడం అనేది రాజకీయ దురుద్దేశంతో ఉన్నట్లుగా స్పష్టం అవుతోంది.ఇదిగో ఇందుకు సంబంధించిన ఆధారాలు వీడియో ద్వారా ప్రజలందరికీ తెలియజేస్తున్నాము. ప్రధానంగా విజయవాడ ప్రజలందరూ గమనించి ఈ విషయాన్ని ఆంధ్ర ప్రదేశ్ ప్రజలకు, ప్రపంచంలో ఉన్న తెలుగు ప్రజలకు తెలియజేయాలి.మారణాయుధాలతో దాడి చేసిన న్యాయవాది భగవాన్ కుటుంబంకి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. న్యాయవాది భగవాన్ ఏ విధంగా మారణాయుధాలతో దాడి చేస్తారో, అందుకు సంబంధించిన సీసీ ఫుటేజ్ ను ప్రజలందరూ పరిశీలించాలి.భగవాన్,న్యాయవాది వృత్తిని చేపడుతూ ఈ విధంగా మారణాయుధాలతో దాడి చేయవచ్చా, చట్టాన్ని మీ చేతిలోకి తీసుకునే అధికారం ఎవరు మీకు ఇచ్చారు. విజయవాడ నగరంలో లిసీఐ ఉమర్లి ని లక్ష్యంగా చేసుకొని ఈ విధంగా రాజకీయ బురద జల్లడం అనేది పద్ధతి కాదు. ఆయన గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలోను కొత్తపేట సిఐగా పనిచేశారు, ఇప్పుడు వైకాపా ప్రభుత్వంలో భవాని పురం సిఐ గా పని చేస్తున్నారు, ఇది కావాలని ఈ ప్రభుత్వం తీసుకువచ్చిన అంశం కాదు, గత ప్రభుత్వంలో ఆయన పశ్చిమ నియోజకవర్గంలో సీఐగా పనిచేశారు, రాజకీయంగా బురద జల్లి ఆయన్ని ఏదో చేయాలని అనుకోవడం పద్ధతి కాదు, ఒకసారి ఆలోచన చెయ్యాలని విజ్ఞులైన ప్రజలందరూ కూడా కోరుచున్నాము.

## గోపాల్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉ టాం :ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



నందిగామ మార్చ్ 21 ప్రజా పాలన ప్రతినిధి: పట్టణం లోని కెవిఆర్ కాలేజ్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో (బండి స్కిడ్ అయి) మృతి చెందిన నలజాల గోపాల్ (అయ్యప్ప మొబైల్స్) పార్థివ దేహాన్ని శాసనసభ్య లు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు సంద ర్శించి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు, గోపాల్ మృతి బాధాకరమని, ఆయన కుటుం బ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు, చిన్న వయసులోనే రోడ్డు ప్రమాదంలో మృ తి చెందటం కలిచివేసిందని, వారి కుటుంబ సభ్యుల కు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని ప్రార్థి స్తున్నట్లు తెలిపారు

## పోలీస్స్టేషన్లో తనిఖీ



ఏర్పేడు ప్రజాపాలన ప్రతినిధి: ఏర్పేడు పోలీస్ స్టేషన్ నో పర్యవేక్షించిన తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి. ప్రతి సంవత్సరం పోలీస్స్టేషన్లో తనిఖీ చేసి పర్యవేక్షించడంలో భాగంగా స్టేషన్ లోని అన్ని రికార్డులను పరిశీలించడం జరిగింది. పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న కేసులను పూర్తి చేయాలని , కేసులను పెట్టే సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండాస్వేచ్ఛగా వాళ్లతో మాట్లాడి, కేసు పెట్టిన తర్వాత ఇరువురిని స్టేషన్ దగ్గరకు పిలిపించి వారిని సమన్వయపరిచి వీలైనంతవరకు కేసును సులభంగా చేయడం, మరియు ఏర్పేడు పోలీస్ స్టేషన్ పరిధిలో హైవే దూరం ఎక్కువగా ఉన్నందువలన హైవే పెట్రోల్ ఎప్పటికప్పుడు విధి నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా గస్తీ పనిచేయాలని మరియు ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజల పట్ల పోలీసులు మంచి ప్రవర్తనతో దురుసుగా మాట్లాడకుండా ఉండాలని స్టేషన్ పరిధిలో ఎలాంటి అవంతరాలకు రౌడీయిజానికి మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా చూడాలని యువతలో చైతన్యం వచ్చేటట్లుగా పోలీసు వారు కౌన్సెలింగ్ ఇవ్వాలని, వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని హెల్మెట్ లేకుండా ప్రయాణించే వాహనదారులకు హెల్మెట్ ధరించాలని విధిగా తెలియజేయాలని, ముఖ్యంగా మహిళల విషయంలో జాగ్రత్త వహించాలని పలు కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి గారు తెలియజేశారు.

## ప్రవాస వాసవి అసోసియేషన్ చైర్మన్ ఆధ్వర్యంలో పుస్తక మిత్ర నవలలు పుస్తకాలు కవులు పుస్తకాలు ప్రముఖులు రచించిన గ్రంథాలయ పుస్తకాలు పంపిణీ






కారంపూడి...మార్చ్21..ప్రజాపాలన.. ప్రతినిధి :పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల మరియు బాల బాలికల గురుకుల పాఠశాల వాసవి అసోసియేషన్ చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పుస్తక మిత్ర నవల పుస్తకాలు, కవుల పుస్తకాలు, ప్రముఖుల రచించిన పుస్తకాలు, డ్రాయింగ్ పుస్తకాలు, పొడుపు కథలు పుస్తకాలు, విద్యార్థులకు అవగాహన కోసం ఈ పుస్తకాలు పుస్తక మిత్ర అనే గ్రంథాలయం లాగా ఏర్పాటు చేసి విద్యార్థులు ఎప్పటికప్పుడు పుస్తకాలను వీక్షించి మెరుగుపడాల్సిందిగా కోరారు విద్యార్థులకు చదువుపై శ్రద్ధ చూపాలని విద్యార్థులకు ఎల్లప్పుడూ ప్రవాస వాసవి అసోసియేషన్ వారు అందుబాటులో ఉంటారని విద్యార్థులు సౌకర్యాల కోసం ఏమైనా ఇబ్బందులు ఉన్న మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామనివారు అన్నారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా %జూ% ప్రసాద్, అమరజీవి పొట్టి శ్రీరాములు శృతి పరిరక్షణ వ్యవస్థాపక అధ్యక్షులు గుడివాడ వేణుగోపాలరావు లక్ష్మీనారాయణ, బాల గురవయ్య, శ్రీనివాసరావు, చెన్నకేశవరావు ,పందిరి పుల్లారావు, పందిరి రామారావు ,పంతంగి కోటేశ్వరరావు, దివ్వెల మనోహర్, పట్టణ ఆర్యవైశ్య సంఘ సభ్యులు భవరిశెట్టి రామారావు ఆతుకూరి గోపి సురె ప్రసన్న రామకృష్ణ కొమ్మూరి కిషోర్ కొత్త బ్రహ్మేశ్వర రావు వెంపటి రామాంజనేయులు ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు పూర్తి మద్దతు

బాపట్ల జిల్లా ప్రజా పాలన మార్చి 21: ఉండి వీరి ప్రక్షాన పోరాటం కొనసాగిస్తానని బాధితుల నిరాహార దీక్ష లో అంబేద్కర్ యువజన




నాయకులందరి కలిసి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని సాను అనుకూలంగా కలిసి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని అందరూ కలిసి వీరికి న్యాయం జరిగే వరకూ మద్దతుగా కలిసి ఉంటామని అధికారులు తక్షణమే స్పందించి వీధి సమస్య పరిష్కరించాలని కోరుతున్నాను దళితులకు జీవించే హక్కు లేదా అయితే మమ్మల్ని చంపేయండి లేదా ప్రాథమిక హక్కులను కాపాడి రక్షణ కల్పించండి మాకు న్యాయం చేయండి న్యాయం జరిగే వరకూ మా నిరాహార దీక్ష ఆగదు కొనసాగిస్తామని అధికారులు స్పందించే వరకు మా పోరాటం కొనసాగిస్తాము.

## అక్రమంగా అరెస్టు చేసిన విఆర్ఓను విడుదల చేయాలి - విఆర్ఓ అసోసియేషన్



గుడివాడ : విఆర్‌వోపై మహిళా కానిస్టేబులు దాడి చేసి విఆర్‌ఓపై కేసులు పెట్టడం దారుణమాని మహిళా కానిస్టేబుల్ అరెస్టు చేయాలని జిల్లా విఆర్ఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోసూరి అర్జునరావు, డివిజన్ అధ్యక్షుడు గూడపాటి లక్ష్మణరావులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్‌డివో కార్యాలయం వద్ద విఆర్ఓ అసోసియేషన్ అధ్వర్యంలో పోలీసులు తీరును ఖండిస్తు ఆర్‌డివోకు విన్నతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిన్న మహిళా కానిస్టేబుల్ రామదేవి, విఆర్ఓ అనిల్‌కి మధ్య జరిగిన ఘర్షణలో పోలీసులు ఏకపక్ష చర్యలు తీసుకోవడ దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓలు. రెవెన్యూ, ఉద్యోగులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న గోరుముద్ద ద్వారా రాగిజావ పంపిణీ చేసి న సర్పంచ్ వేల్పుల పద్మకుమారి



పెనుగంచిప్రోలు మార్చ్ 21 ప్రజా పాలన ప్రతినిధిజగ నన్న గోరుముద్ద ద్వారా బడి పిల్లలకు వారానికి మూడు రోజులు ఉదయం పూట రాగి జావ అందించే కా ర్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం క్యాంపు కార్యాలయం నుంచి లాంఛ నంగా ప్రారంభించారు స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉ దయభాను ఆదేశానుసారం మండలకేంద్రంలో ఎంపీ పీస్ మెయిన్,ఎంపీపీ ఈస్ట్, ఎంపీపీ గర్ల్స్ పాఠశాలల నందు గ్రామ పంచాయితీ సర్పంచ్ వేల్పుల పద్మకు మారి లాంఛనంగా ప్రారంభించారుఈ సందర్భంగా స ర్పంచ్ మాట్లాడుతూ తాజాగా రాగి జావ కోసం ఏటా మరో రూ.86 కోట్లు కలిపి మొత్తం రూ.1,910 కోట్లు వెచ్చిస్తూ పిల్లలకు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తోంది అని పేద విద్యార్థుల చదువుల, పౌష్టికాహా రం కోసం జగనన్న ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అన్నారుఈ కార్యక్రమంలో మండల మహిళసమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ ఎంపీటీసీ సభ్యురాలు జం గం విరమ్మ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ లు ప్రధా నోపాధ్యాయులు, రుద్ర శ్రీనివాసరావు వడ్డాతి పద్మశ్రీ గుడిమెట్ల వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులు,వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ సెక్రటరీలు చిన్ని కృష్ణ, కృష్ణ మోహ న్ తదితరులు పాల్గొన్నారు

## జగనన్న "గోరుముద్ద"లో భాగముగా రాగి జావ పంపిణీ చేసిన సర్పంచ్ అంచుల రామాంజనేయులు



రాజు పాలెం ప్రజాపాలన ప్రతినిధి: రాజుపాలెం మండలం అంచుల వారి పాలెం గ్రామంలో జగనన్న "గోరుముద్ద'లో భాగంగా రాగిజావ పంపిణీ చేసిన సర్పంచ్ అంచుల రామాంజనేయులు సందర్భంగా సర్పంచ్ గారు మాట్లాడుతూ మన ముఖ్యమంత్రివర్యులు శ్రీ జగన్మోహన్ రెడ్డి గారు నేటి బాలలే రేపటి పౌరులని తలచి బడికి వెళుతున్న పిల్లలు ఆరోగ్యంగా ఉంటే చదువు తొందరగా వస్తుందని తలచి ఈ ప్రోగ్రాం ని ఏర్పాటు చేయడం జరిగినదని, అంతేకాక రాగిజావలో ఇనుము, క్యాల్షియం పుష్కలంగా ఉండటం వల్ల వారు తొందరగా అలసిపోకుండా ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. బడి పిల్లలకు తగిన పౌష్టికాహారం అందించాలని గత పాలకులు ఆలోచించలేదని ఎదిగే చిన్నారులకు అది ఎంత అవసరమో ఆలోచించి జగనన్న గోరుముద్ద అనే పేరుతో రోజుకో మెనూని తీసుకొచ్చారని అందులో భాగంగానే వారంలో ఐదు రోజులు కోడిగుడ్లను పంపిణీ చేయడమే కాక మూడు రోజులు చిక్కిలు దానికి అదనంగా మరో మూడు రోజులు ఈ రాగిజావని అందించడం జరుగుతుందని తద్వారా పిల్లల్లో ఉన్నటువంటి పౌష్టికాహార లోపాన్ని సరిచేయాలని గొప్పగా ఆలోచన చేసినటువంటి ముఖ్యమంత్రి చరిత్రలో ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క జగన్మోహన్ రెడ్డి గారి మాత్రమేనని ఈ సందర్భంగా కొనియాడారు. ఇంకా ఈ కార్యక్రమంలో మండల వైస్ %వీరా% హరి సూరమ్మ నాగేశ్వరరావు గారు, వైస్ సర్పంచ్ గలభ ధనలక్ష్మి వెంకటేశ్వర్లు గారు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గ్రామ సచివాలయ కన్వీనర్ వేపూరి స్వామి శంకర్ రావు గారు,సెక్రటరీ ముక్తార్ గారు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమీజా భాను గారు ఉపాధ్యాయ ,ఉ పాధ్యాయునులు మరియు పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జగనన్న గోరుముద్దలో భాగంగా రాగిజావ అందించే కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



నందిగామ మార్చ్ 21 ప్రజా పాలన ప్రతినిధి:పట్టణం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న గో రుముద్ద పథకంలో భాగంగా మధ్యాహ్న భోజనంలో రాగిజావ అందించే కార్యక్రమాన్ని శాసనసభ్యులు డా క్టర్ మొండితోక జగన్ మోహన్ రావు ప్రారంభించారు అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ము ఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ పా ఠశాలలో చదివే విద్యార్థులను సొంత కుటుంబ స భ్యుల మాదిరి భావించి మేనమామగా బాధ్యత వహి స్తూ వారి పరిపూర్ణ ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టా రని, విద్యార్థులకు రక్తహీనత పోషక లోపాన్ని నివా రించేందుకు పౌష్టికరమైన ఐరన్, క్యాల్షియం, ప్రోటీన్స్, విటమిన్స్ తో కూడిన భోజనాన్ని అందించేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు, విద్యా ర్థులు ఆరోగ్యంగా ఉంటేనే ఆనందంగా ఉంటారని, ఆరోగ్యంతోనే మానసిక వికాసం, శరీరం ఎదుగుదల ఉంటాయని ప్రతిరోజు మన ప్రకారం విద్యార్థులకు రుచికరమైన, ఆరోగ్యకరమైన, నాణ్యమైన, పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నారన్నారు, ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవీంద్ర, నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం, జడ్పిటిసి గాదెల బాబు, ఎంఈఓ బాలాజీ నాయక్, ప్రధానోపాధ్యాయులు రాం బాబు నాయక్, కౌన్సిల్ సభ్యులు పాకాలపాటి కిరణ్, మారం అమరయ్య, ఖాలిక్, కో ఆప్షన్ దాసు, గరికపా టి నానయ్య, పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల భవిష్యత్తుకు భరోసానిచ్చిన సీఎం: ప్రభు త్వ విప్ సామినేని ఉదయభాను



జగ్గయ్యపేట మార్చి 21 ప్రజా పాలన ప్రతినిధి మం డలపరిధిలోని షేర్ మహమ్మద్ పేట గ్రామానికి చెంది న గాదే సురేష్ కుమార్తెలు అంతు పట్టని అరుదైన వ్యాధితో బాధపడుతూ చికిత్స నిమిత్తం నెలకు సు మారు 20 వేల రూపాయలు ఖర్చు అవుతున్నందున ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు రాష్ట్ర ప్ర భుత్వవిప్ సామినేని ఉదయభానుదృష్టికి తీసుకు వచ్చిన నేపథ్యంలో స్పందించిన ఆయన మానవతా దృక్పథంతో జగనన్న విద్యా దీవెన కార్యక్రమానికి సం బంధించి తిరువూరు నియోజకవర్గానికి వచ్చిన ము ఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసిన ఉదయభాను చిన్నారుల పరిస్థితిని వివరించడం జరిగింది.తక్షణమే స్పందించిన జగన్మోహన్ రెడ్డి తక్షణ సహాయం కింద లక్ష రూపాయలు అందించడం జరిగింది.అదేవిధంగా వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహా యం అందజేయడం జరుగుతుందని భరోసా ఇచ్చా రు.నెలవారి వారికి అయ్యే ఖర్చుల నిమిత్తం పిల్లలకు పెన్షన్ కూడా మంజూరు చేయడం జరుగుతుందని తె లిపారుఈ సందర్భంగా మంగళవారం స్వగృహంలో ప్రభుత్వవిప్,శాసనసభ్యులు సామినేని ఉదయభాను సతీమణి విమలభాను,యువనాయకులు వెంకట కృష్ణ ప్రసాద్ బాబుగాదే సురేష్ కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంజూరు చేసిన చెక్కును వారికి అందజేశారుఇంతటి సహాయాన్ని అందించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రభు త్వవిప్ సామినేని ఉదయభానుకి వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్ర మంలో షేర్ మహమ్మద్ పేట నాయకులు పెద్దిరెడ్డి స్వామి,మోరే వినోద్, నాగుల్ మీరా,ఉద్దుగూరి కృ ష్ణ,సుంకిరెడ్డి ఉపేందర్ రెడ్డి,శరణం ఉపేంద్ర,రామకోటి, వత్సవాయి మండల పార్టీ అధ్యక్షులు గాదెల రామా రావు, తన్నీరు నాగేంద్ర,ఇన్చార్జి ఎమ్మార్వో నాగరాజు, తదితరులు పాల్గొన్నారు

## నీటి వనరులను కాపాడుకోవడంలో ప్రజలు ప్రధాన భూమిక పోషించాలి: జలజీవన్ మిషన్ డైరెక్టర్ హరే రామ్ నాయక్



కంచికచర్ల మార్చి 21 ప్రజాపాలన ప్రతినిధి:భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పరిశుభ్రమైన నీటిని అందిం చేందుకు నీటిని పొదుపుగా వాడుతూనీటి వనరుల ను రక్షించుకోవాల్సిన కోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉ ందని జల జీవన్ మిషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హరే రామ్ నాయక్ తెలిపారు. జల్ జీవన్ మిషన్ ఆధ్వర్యంలో మంగళవారం కంచికచర్ల మండలం పరిటాల సచివా లయంలో ప్రపంచ నీటి దినోత్సవం జరిగింది. కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పిడి హరే రామ నాయక్ మాట్లాడుతూ నీటి వనరులను కాపాడుకో వ డంలో ప్రజలుముఖ్యంగా యువత ప్రధాన భూమిక పోషించాలన్నారు. భవిష్యత్ తరాలకు నాణ్యమైన పరిశుభ్రమైన నీటిని అందించాల్సిఉందన్నారు. జల జీవన మిషన్ ద్వారా గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్ర మైన నీటిని అందిస్తున్నామన్నారు. గ్రామాలలో నీటి నాణ్యత సరఫరాలో ఎఫ్ టి కే కిట్ ద్వారా నీటి నా ణ్యతా ప్రమాణాలు పరిశీలిస్తున్నామన్నారు. కేంద్ర రా ష్ట్ర ప్రభుత్వాలు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్య క్రమంలో ఇంటింటికి కుళాయి కనెక్షన్లు అందించేందు కు చర్యలు తీసుకుంటున్నామని, నీటి వనరులు కా పాడుకునేందుకు పతి ఇంట్లో, పతి గ్రామంలో నీటి గురించి చర్చ జరగాల్సి ఉందన్నారు. అప్పుడే గ్రా మాలు సుస్థిర నీటి స్థానాన్ని కల్గి ఉంటాయని వివరిం చారు. ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ మాట్లాడుతూ నీటి పొదు పు చేయడం, ఇంటికీ కుళాయి కనెక్షన్లు పనుల మం జూరు గురుంచి, స్కూల్ విద్యార్థలకు నీటి వనరులు పొదుపు గురుంచి వివరించారు.ఏమ్ పీ డి ఓ బాల శంకర్రావు మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ ప థకం అమలులో నీటి నిల్వ కట్టడాలు గురించీ వివ రించారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా పరి టాల గ్రామంలో నీటి వనరులు కాపాడుకోవడంలో గ్రామీణ నీరు పారిశుద్ధ్య కమిటీ, ప్రజల పాత్ర గురుం చి వివరించారు. భారత ప్రభుత్వం జల జీవన్ మిష న్, గ్రామీణ నీరు పారిశుద్ధ్య శాఖ హార్ట్ అమలు సహా యక సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవం రోజును పరిటాల గ్రామంలో నిర్వహించారు.ఈకార్యక్ర మంలో గ్రామ సర్పంచ్ వై. అన%శీ%ద జ్యోత్స్న, సెక్రెటరీ, డి పి ఏమ్ యు కోఆర్డినేటర్స్ రామక్రిష్ణ. నాగేశ్వర రావు, ప్రోగ్రామ్ మేనేజర్ రామ శేష చార్యులు, హార్ట్ ఎన్జీవో సిబ్బంది హరిక లక్ష్మీ, ప్రసాద్, లక్ష్మణ్, రామ చంద్ర రావు,శివ , సచివాలయం సిబ్బంది పాల్గొన్నా రు.

## ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో రాగి జావా పంపిణీ




ఏర్పేడు ప్రజాపాలన ప్రతినిధి: ఏర్పేడు మండల ప్రధాన కేంద్రమైన ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈరోజు రాగి జావా కార్యక్రమం ప్రారంభించారు. పిల్లలకు పౌష్టికాహారంలో భాగంగా "జగనన్న గోరుముద్ద" కార్యక్రమంలో వారంలో మంగళ, గురు, శనివారాల్లో రాగిజావును పిల్లలకు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్లు, స్కూల్ హెడ్మాస్టర్ సునీత ప్రారంభించారు." జగనన్న గోరుముద్ద" ఈ రాగిజావ కార్యక్రమానికి సత్యసాయి ట్రస్ట్ వారు సంవత్సరానికి 42 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని, దీనిని మూడు సంవత్సరాలు కాలపరిమితిలో అమలు చేస్తారని స్కూల్ హెడ్మాస్టర్ పిల్లలకు తెలియజేశారు. పిల్లలందరూ ఆరోగ్యంగా ఉండాలని బాగా చదువుకోవాలని ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డి ఈ మంచి కార్యక్రమాన్ని పిల్లలకు అందజేయడం ఎంతో హర్షించదగ్గ విషయమని తెలియజేశారు.

## జగనన్న గోరుముద్దలో మరో పోషకాహారం: ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



పల్నాడు జిల్లా. నరసరావుపేట. మార్చి 21 (ప్రజా పాలన ప్రతినిధి)"జగనన్న గోరుముద్ద" మరో పోషకాహారం నేటి నుండి బడి పిల్లలకు ఉదయం పూట రాగి జావ అందించే కార్యక్రమాన్ని నరసరావుపేట పట్టణంలో స్థానిక మున్సిపల్ బాలిక హై స్కూల్ ప్రాంగణంలో నేడు లాంఛనంగా ప్రారంభించిన గౌరవ శాసనసభ్యులు డా. గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి.రాష్ట్ర వ్యాప్తంగా 44,392 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని 37,63,698 మంది విద్యార్ధులకు లబ్ధి చేకూరుస్తూ ఏటా రూ.86 కోట్ల అదనపు వ్యయంతో రాగిజావ అందించే కార్యక్రమాన్ని క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం వైయస్. జగన్మోహన్ రెడ్డి.సత్య సాయి స్వామి వారి ఆశీస్సులు మన ప్రభుత్వానికి ఉన్నాయి అని భావిస్తున్నా.రాగి జావ కార్యక్రమంతో భాగస్వామ్యం అయిన సత్య సాయి ట్రస్ట్ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు డా?? గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు శాసనమండలి ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి , జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ , డిఈఓ , డిఆర్ఓ , ఎమ్మార్వో , పిడి ఇతర ఉన్నతాధిరులు పాల్గొన్నారు.

## సంగరజాతి దేవస్థానం చైర్మన్ పదవి ఇచ్చి ముఖ్యమంత్రికి మేము అండగా ఉంటాం: సంగర కులస్థులు



గుడివాడ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి సంగరజాతికి సంబంధించిన కర్నాటి రాంబాబును విజయవాడలోని ఇంద్రకీలాద్రి అమ్మవారి దేవస్థానం చైర్మన్‌గా నిమించడం పట్ల బిసిలోని సంగరకులస్థులు కేటాయిండం అభినందనీయమాని సంగరకుల నాయకులు గుళ్లపల్లి శ్రీనివాసరావు, గజ్జల నారాయణ, నక్క వెంటకటేశ్వరరావు, కర్నాటి శివాలు అన్నారు. మంగళవారం స్థానిక కవిరాజ కళామందిరం సమీపంలో సంగర కార్యాలయంలో సంగర కులస్థులు 2023 క్యాలండర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసిలకు సముచిత స్థానం కల్పించిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అన్నారు. రాష్ట్రంల పేరు గచిన దేవలయాలోని విజయవాడలోని ఇంద్రకీలాధ్రీ దేవస్థానంకు సంగరజాతికి చెందిన కర్నాటి రాంబాబును చైర్మన్ నిమిచడం గొప్ప విషయమన్నారు. బిసిలు అయన వెంటే ఉండి వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలలో వైసీపీ విజయం సాధింస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గండికోట గోపికృష్ణ, కగ్గా వెంకటేశ్వరరావు, రెడ్డి ఆంకాలు, ఇబ్బా వెంకీ, కాఠారి ప్రసాద్ బిసి నాయకులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సేవా సమితి అధ్వర్యంలో 23న ఘనంగా ఉగాది వేడకులు: బ్రహ్మణ సేవా సమితి



గుడివాడ : శ్రీశోభకృత్‌నామ ఉగాది మహోత్స వేడుకలను బ్రాహ్మణ సేవ సమితి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధ్యక్షా, కార్యదర్శిలు వఠెం ఎం.పి.బి కుమార్,(చిట్టి), జోన్నవిత్తుల జయరామ్‌లు తెలిపారు. మంగళవారం స్థానిక బంటుమిల్లి రోడ్డులోని శంకరమఠంలో ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశంలో వారు మాట్లాడుతూ బుధవారం ఉగాది పురష్కరించుకుని బంటుమిల్లిరోడ్డులోని శ్రీవీరాంజనేయ దేవస్థానం ప్రాంగణలో సాయంత్రం 5గం॥ 45 ని॥ల నుండి బ్రాహ్మణ సేవా సమితి, గాయత్రి వేద విద్యుత్ సభ, పట్టణ వైదికస్మార్ర పురోహిత సంఘం, అర్చక సమ్మెఖ సంఘం, శంకర వాగ్దేవి స్మార్ర పురోహిత సంఘుల అధ్వర్యంలో వివిధ కార్యక్రమలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమలకు బ్రాహ్మణ సోదరి, సోదరులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## సిమెంట్ రోడ్డు కు భూమి పూజ



ఏర్పేడు ప్రజా పాలన ప్రతినిధి: ఏర్పేడు మండలం పెనుగడం గ్రామపంచాయతీలో మంగళవారం కొత్త సిమెంట్ రోడ్డు కు భూమి పూజ చేయడం జరిగింది.ఏర్పేడు మండల వైసిపి ఇన్చార్జి గున్నేరి కిషోర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కిషోర్ రెడ్డి మాట్లాడుతూ పెనిగడం పంచాయతీలో 25 లక్షల వ్యయం తో సిమెంట్ రోడ్డును వేయడం జరుగుతున్నదని ప్రజలు రాబోయే ఎన్నికల్లో వైసీపీని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాతవిరాపురం సర్పంచ్ గురవారెడ్డి ఎంపీపీ గీత, పెరగడం సర్పంచ్ స్రవంతి మరియు రమేష్ రెడ్డి, పెనుగడం గ్రామ కన్వీనర్ పెరగడం శ్రీధర్, యుగంధర్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించడమే జగనన్న లక్ష్యం



సత్తనపల్లి ప్రజాపాలన ప్రతినిధి: ఈరోజు జగనన్న గోరుముద్ద లో మరో పోషకాహారం రాగిజావను అందించే కార్యక్రమాన్ని ఎంపీపీ పాఠశాల, వావిలాలనగర్ నందు స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు నిత్య ప్రియదర్శిని ధర్మరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో ఇప్పటికే మధ్యాహ్న భోజన మెనూ లో మార్పులు చేసి మెరుగైన, రుచికరమైన, నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని విద్యార్థులకు అందిస్తున్న ప్రభుత్వం కొత్తగా విద్యార్థుల్లో రక్తహీనత, పోషక లోపాన్ని నివారించేందుకు వారానికి మూడు రోజులు బెల్లంతో కూడిన రాగిజావను అందించడం జరుగుతున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బెల్లంకొండ నాగసాయి ప్రసాద్, డీలర్ రవిచంద్రన్, స్వామినాథన్ బాలసుబ్రమణ్యం, యం డి యం నిర్వాహకాలు రాణి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన జనసేన పార్టీ మండల అధ్యక్షులు తోట నరసయ్య



రాజుపాలెం ప్రజాపాలన ప్రతినిధి: అకాల వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో చేతికొచ్చిన పంట రాత్రికి రాత్రి చేజారిపోవడంతో రైతుల ఆవేదన చెప్పలేనిదని రాజుపాలెం మండల జనసేన పార్టీ అధ్యక్షులు తోట నరసయ్య అన్నారు, సోమవారం మండలంలోని నెమలిపురి, దేవరంపాడు, అనుపాలెం, అంచులవారిపాలెం గ్రామాలను సందర్శించి పంట నష్టపోయిన రైతులను కలిసి వారి పొలాలను పరిశీలించారు, ఈ సందర్భంగా రాజుపాలెం మండలం జనసేన పార్టీ అధ్యక్షులు తోట నరసయ్య మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో వరి, మొక్కజొన్న, మామిడి, చిరుధాన్యాల రైతులు పూర్తిగా దెబ్బతిన్నారని, మొక్కజొన్న పూర్తిగా పడిపోయిందని, వరి గింజలు మొత్తం రాలిపోయాయని, మామిడి చెట్లు ఏరులతో సహా పడిపోయాయని, వెంటనే ప్రభుత్వం స్పందించి అధికారులచే నష్ట అంచనా వేయించి రైతులకు నష్టపరిహారం త్వరగా అందేలా చేయాలని జనసేన పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని తోట నరసయ్య తెలిపారు, అదేవిధంగా కొండమూడు గ్రామంలో 33 కెవి విద్యుత్ మెయిల్ లైన్ వైరు తెగి మెయిన్ రోడ్ లోని హోటల్స్ మీద పడడంతో గ్రైండర్లు, టీవీలు, ఫ్రిజ్లు కాలిపోయాయని, రేకుల షెడ్లు మొత్తం పడిపోయారని, విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని, తక్షణమే విద్యుత్ శాఖ వారిపై చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన హోటల్ యజమానులకు న్యాయం చేయాలని జనసేన పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు, రైతులకు న్యాయం చేయాలని రాజుపాలెం మండల తహసీల్దార్ నళిని కి మెమోరాండం ఇవ్వడం జరిగిందని పత్రిక విలేకరుల సమావేశంలో జనసేన పార్టీ అధ్యక్షులు తోట నరసయ్య తెలిపారు.

## మంత్రి విశ్వరూప్ సహాయముతో నేదునూరి దివ్య హర్షిత 3 లక్షలు వైద్య సహాయం: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



అమలాపురం మార్చి 21 ప్రజాపాలన ప్రతినిధి. :మంత్రి విశ్వరూప్ సహాయముతో నేదునూరి దివ్య హర్షిత 3 లక్షలు వైద్య సహాయం అందించినట్లు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం తోత్తరమూడి గ్రామానికి చెందిన నేదునూరి ధనరాజు, దుర్గావాణి దంపతుల కుమార్తె నేదునూరి దివ్య హర్షిత కు గుండెలో రంధ్రం ఏర్పడడంతో చికిత్స నిమిత్తం రాష్ట్ర రవాణాశాఖ మంత్రివర్యులు పినిపే విశ్వరూప్ వారిని ఆశ్రయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మంత్రివర్యులు ఆ యొక్క కేసును జిల్లా కలెక్టర్ వారికి రిఫర్ చేయగా ఈ అమ్మాయి కి మూడు లక్షల ఖరీదైన శస్త్ర చికిత్సను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా తిరుపతిలోని పద్మావతి హృద యాలయ ఆసుపత్రిలో నిర్వహించి గుండె రంధ్రాన్ని పూడ్చడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. మంగళవారం దివ్య హర్షిత తమ తల్లిదండ్రులతో కలెక్టరేట్ నకు వచ్చి జిల్లా కలెక్టర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ టి రాధాకృష్ణ మేనేజర్ నవీన్, టీం లీడర్ సత్యనారాయణ డి సీ. హెచ్ ఎస్ పద్మశ్రీ రాణి, డాక్టర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# ఏర్పేడు పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ



శ్రీకాళహస్తి ప్రజాపాలన ప్రతినిధి: వార్షిక తనిఖీలలో భాగంగా మంగళవారం జిల్లా ఎస్పి శ్రీ పి. పరమేశ్వర రెడ్డి ఐపీఎస్., గారు తిరుపతి జిల్లా లోని ఏర్పేడు పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసి ఎస్. హెచ్. ఓ. మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది యొక్క పనితీరును సమీక్షించి జనరల్ డైరీ, కేసు డైరీ, కోర్టు క్యాలెండర్ వంటి పలు రికార్డులను తనిఖీ చేసి పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నందు పెండింగ్లో ఉన్న కేసులను సకాలంలో దర్యాప్తు పూర్తి చేసి బాధితులకి సరైన న్యాయం చేసి, సైబర్ నేరాల పట్ల సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి త్వరిత గతిన పూర్తి చేయాలనీ మహిళా సంభందిత నేరాల పట్ల వెంటనే స్పందించి న్యాయం చేయాలన్నారు. ఏర్పేడు పోలీస్ స్టేషన్ పరిధి గుండా ఎక్కువగా హైవే రహదారుల నిర్మాణం జరుగుతున్నందున నిరంతరం అప్రమత్తంగా ఉంటూ రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు ప్రత్యేక కార్యచరణ చేపట్టి, ప్రమాదకరమైన మలుపులు, రోడ్ క్రాసింగ్ లను గుర్తించి అక్కడ సూచిక బోర్డులను, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా అరికట్టి, వాహనాల తనిఖీలను నిర్వహించి, ఎర్ర చందనం, మాదకద్రవ్యాల అక్రమ రవాణాన్ని అరికడుతూ, అలాగే హైవే పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం రహదారి యందు తిరుగుతూ నేరాలు జరగకుండా నివారించాలన్నారు. స్టేషన్ పరిధి లో గల కేడీలు, బీసీలు,డిసీలు, పాత నేరస్తులు, అనుమానితుల కదలికలపై ప్రత్యేకమైన నిఘా ఉంచుతూ, పోలీస్ స్టేషన్ పరిధిలో నేర నివారణ చేయుటకు బీట్ సిస్టంను మరింత మెరుగుపరచాలన్నారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల యందు మద్యపానం సేవించకుండా అరికట్టడానికి ప్రత్యేక భద్రతా దళాలతో పెట్రోలింగ్ చేస్తూ, తిరుపతి ఐఐటీ, ఐఐఎస్ఇఆర్, తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం చుట్టూ ఉన్న ఇండస్ట్రియల్ ఏరియా పరిసర ప్రాంతాల నుండి హైవే రహదారుల వరకు నిరంతరం గస్తీ కాచుటకు బ్లూ బీట్ సిస్టంను బలోపేతం చేసి, మరింత సమర్థవంతంగా పనిచేసి నేర నివారణ చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ కి వచ్చే ఫిర్యాదుదారుల యొక్క ఫిర్యాదులను స్వీకరించి చిన్న సమస్యగా ఉన్నప్పుడే ఇరుపక్షాలను పిలిపించి, వారితో మాట్లాడి, వారిని రాజీ చేయించి, ఎటువంటి నేరం జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమై వారి సాధకబాధలను అడిగి తెలుసుకున్న అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ క్రమశిక్షణతో అలసత్వం ప్రదర్శించకుండా, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా విధుల యందు మానవతా దృక్పథంతో నిక్కచ్చిగా ఉండి, స్టేషన్ కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారికి మేమున్నామనే ధైర్యాన్ని ఇచ్చి ఫిర్యాదిదారులకు భరోసా ను కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గల మహిళా సంరక్షణ కార్యదర్శుల పనితీరుని సమీక్షించిన పిమ్మట వారితో మాట్లాడుతూ నేటి సమాజంలో గృహ నిర్బంధ మహిళ సంబంధిత విషయాలను, బాలికలు ఎదుర్కొంటున్న ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ మరియు పోక్సో చట్టం వంటి విషయాల గురించి సంబంధిత విద్యా సంస్థలు, పారిశ్రామిక ప్రాంతాల యందు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి చైతన్యవంతులను చేసి, కళాశాల, పాఠశాలల్లో బాలికల పట్ల ఉపాధ్యాయుల అసభ్య ప్రవర్తన గురించి విద్యార్థులతో మాట్లాడి తెలుసుకొని ఏదేని అనుకోని సంఘటనలు జరిగి ఉంటే తమ ఎస్. హెచ్. ఓ. గారికి తెలియపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట డిఎస్పి రామచంద్ర, సిఐ లు చంద్రశేఖర్ పిళ్ళై డి.సి.ఆర్.బి, శ్రీ హరి ఏర్పేడు, ఎస్ఐ లు మరియు ఏర్పేడు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీల పట్ల జగన్ రెడ్డి తీరు దుర్మార్గం



నరసాపురం మార్చి 21 (ప్రజాపాలన ప్రతినిధి) : ఇంటింటికి వెళ్లి గర్భిణీలు, చిన్నారుల ఆలనా పాలనా పర్యవేక్షిస్తున్న అంగన్వాడీల పట్ల జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడం దారుణమని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, పశ్చిమ గోదావరి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. కనీస వేతనం రూ.26 వేలు, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, ఐసిడిఎస్ ను బలోపేతం చేయడం, రిటైర్మెంట్ ప్రయోజనాల వంటి న్యాయమైన డిమాండ్లను అంగన్వాడీలు కోరుకోవడం వైసీపి ప్రభుత్వానికి పెద్ద నేరంలా అనిపిస్తోందని అన్నారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనని 2018 జూలైలో అంగన్వాడీలకు రూ 7 వేల నుంచి రూ 10 వేల 500లకు, ఆయాలకు రూ.4,500 నుంచి రూ. 7 వేలకు వేతనాలు పెంచడం జరిగిందని ఆమె అన్నారు. జగన్ ప్రభుత్వం జీతాలు ఇవ్వనప్పటికీ అంగన్వాడీ సిబ్బందితో వెట్టి చాకిరి చేయిస్తున్నారని ప్రభుత్వ పథకాల అమలు బాధ్యత మొదలు కరోనా విధుల వరకు మొత్తం వారిపైనే పనిభారం మోపుతున్నారని డాక్టర్ రాజలక్ష్మి విమర్శించారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో జీతాల పెంపుతో పాటు 18,301 అంగన్వాడీ కేంద్రాలను నిర్మించడం జరిగిందని 55, 607 అంగన్వాడీల ద్వారా 40 లక్షల మందికి లబ్ది చేకూర్చడం జరిగిందని 90 శాతం అంగన్వాడీ కేంద్రాలలో త్రాగునీరు, విద్యుత్తు, మరుగు దొడ్లు సౌకర్యాలు కల్పించడం జరిగిందని ఆమె వివరించారు. వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రెండున్నర ఏళ్ళుగా అంగన్వాడీ కేంద్రాలు అభివృద్ధికి నోచుకోలేదని ప్రస్తుతం అమలులో ఉన్న వివిధ పథకాలకు అనుగుణంగా ఆన్లైన్ నమోదుకు ఫోన్ల సామర్థ్యం చాలక పోవడంతో ఫోన్లు ఇవ్వాలని అంగన్వాడీలు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించు కోలేదని తెదేపా ప్రభుత్వ హయాంలో ఇచ్చిన సెల్ఫోన్లనే అంగన్వాడీ కార్యకర్తలు ఇన్నాళ్ళుగా వినియోగించారని ఎప్పుడైతే సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీ సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వంపై నిరసనగళం పినిపించారో వెంటనే స్మార్ట్ ఫోనులు ఇస్తామని ఉత్తర్వులు ఇచ్చారని ప్రస్తుత సమస్యను చిన్నది చేసి చూపించడానికి కుటిల యత్నాలు చేస్తున్నారని అంగన్వాడీలకు న్యాయం చేయకపోతే జగన్ ప్రభుత్వం భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని డాక్టర్ రాజలక్ష్మి అన్నారు.

## విద్యార్థులకు జగనన్న గోరు ముద్దు లో భాగంగా రాగి జావ పంపిణీ



కారంపూడి... మార్చ్21 ప్రజాపాలన ప్రతినిధి :పట్టణంలోని బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హై స్కూల్లో విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరు ముద్దు లో భాగంగా రాగి జావ కూడా అందించాలని సియం జగన్ ఆదేశాలు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వున్న పాఠశాలలో రాగి జావను ఇవ్వాలని ఆదేశించారు. ఈ క్రమంలో కారంపూడి బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హై స్కూల్ నందు విద్యా కమిటీ చైర్మన్ ఆతుకూరి గోపి ఆధ్వర్యంలో జరిగిన రాగి జావ విద్యార్థులకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కారంపూడి గ్రామ సర్పంచ్ ప్రమీల భాయ్ తేజా నాయక్, పల్నాడు జిల్లా వక్స్ బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్ జానీ భాష, జడ్పిటిసి షేక్ షఫీ, ఎంపీటీసీ ఆరిఫ్, ఎస్సీ సెల్ నాయకులు కొమ్ము చంద్రశేఖర్, దాసు, పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు, విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని అందజేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో జగనన్న గోరుముద్దలు లో విద్యార్థులకు మరింతగా పౌష్టిక ఆహారం అందించడమే సీఎం జగన్ లక్ష్యమని వారు అన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం పంచిపెట్టిన చందన



రాజమహేంద్రవరం రూరల్: ప్రజా పాలన ప్రతినిధి: కాతేరు గ్రామంలో సచివాలయం 4 నందు పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం దుస్తులు పంచిన రాజమండ్రి రూరల్ కోఆర్డినేటర్ మరియు అంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీనింగ్ మరియు బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్. ఉదయం దగ్గరనుండి ఎప్పటికప్పుడు మన పరిసరాలు పరిశుభ్రంగా వుంచే విధులు నిర్వర్తిస్తున్న మన పారిశుద్ధ్య కార్మికులు ఎంతో అత్యున్నత సేవలు మనకు అందిస్తున్నారు అని, ఒక రోజు గానీ వారు విధులకు హాజరు కాకపోతే కనుక మన పరిసరాలు దారుణమైన స్థితి లో వుంటాయని అటువంటి సేవలు అందిస్తున్న వారిని మనం గౌరవించాలని అని చందన తెలిపారు. ఈ సచివాలయంలో సుమారు 48 మంది పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం దుస్తులు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని చందన తెలిపారు. వారితో మాట్లాడుతూ సమస్యలు ఏమన్నా వుంటే స్థానిక నాయకులకు గానీ లేకపోతే తన దృష్టికి తీసుకుని వస్తే తప్పక వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చిన చందన. ఈ కార్యక్రమంలో యాజ్జ వాసు, కొత్తపల్లి నాగేశ్వరరావు, పెనుమాక సునీల్, ఆచంట కళ్యాణ్, మద్దా దుర్గారావు, మానుకోండ వెంకటరావు, సురేంద్ర, దేవా మాత, చీకట్ల రంజిత్, పోలుమాటి శేఖర్ పార్టీ శ్రేణులు కార్యకర్తలు సచివాలయం సిబ్బంది పంచాయతీ సెక్రెటరీ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు..

## సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

### రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సెంట్రల్ నియోజకవర్గ ప్రజలందరికీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు వారి నూతన సంవత్సరాది అయిన ఉగాది పూర్తిగా ప్రకృతితో మమేకమై జరుపుకునే పండుగ అని, షడ్రుచుల సమాహారమైన ఉగాది పచ్చడి ఇందుకు నిదర్శనమని మల్లాది విష్ణు అన్నారు. మనిషి జీవితంలోని కష్ట సుఖాలు, మంచి చెడులు వంటి జీవిత సారాన్ని తాత్వికంగా గుర్తుచేసుకునే గొప్ప సాంప్రదాయానికి చిహ్నంగా ఉగాది పచ్చడిని సేవిస్తారని పేర్కొన్నారు. ఈ నూతన తెలుగు సంవత్సరం తెలుగువారి జీవితాల్లో ఎనలేని ఆనందం, ఐశ్వర్యం తీసుకురావాలని కాంక్షించారు. వానలు సకాలంలో కురిసి.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. పాడి పంటలతో రైతులు, సకల వృత్తులూ పరిఢవిల్లాలని.. కార్మికులు, నిరుపేదలు, సామాన్యులు సమాజంలోని ప్రతి ఒక్కరూ ఈ నూతన వసంతంలో సుఖశాంతులతో వర్థిల్లాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలందరికీ అభివృద్ధి ఫలాలు మెండుగా అందాలని.. అందరూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని అభిలషించారు.

## వైయస్ పాలెంలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ



నరసాపురం, మార్చి 21 (ప్రజాపాలన ప్రతినిధి) :నరసాపురం మండలం యర్రంశెట్టివారిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని ఒక ఉన్నత పాఠశాల, ఆరు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి నాగ ముత్యమాంబ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగముత్యమాంబ మాట్లాడుతూ పిల్లలపై తల్లిదండ్రులు కూడా చూపని శ్రద్ధ పిల్లల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని విద్యార్థులకు చదువు, వసతి, ఆరోగ్యము ప్రభుత్వం చేపట్టిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ యర్రంశెట్టి త్రినాధ వెంకట నరసింహారావు (బాబులు), స్కూలు కమిటీ చైర్మన్ పులపర్తి నాగేశ్వరరావు, ఎంపిటిసి ఆకన చంద్రశేఖర్ శ్రీదేవి, వైస్ సర్పంచ్ శ్రీదేవి వాసు, స్కూల్ హెడ్ మాస్టర్ పొన్నాల సత్యనారాయణ, సచివాలయం సెక్రటరీ కంచర్ల రఘురాం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మద్దాల గిరిధర్ జన్మదిన వేడుకలు

గుంటూరు ,మార్చి ,21 ప్రజా పాలన, ప్రతినిధి : గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు మద్దాల గిరిధర్ జన్మదిన వేడుకలు మంగళవారం ఉదయం బృందావన్ గార్డెన్స్ రెండవ లైన్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు , మెరుగ నాగార్జున ,తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు ముస్తఫా, ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి , శాసనమండలి సభ్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఇటీవల ఎన్నికైన శాసనమండలి సభ్యులు చంద్రగిరి ఏసురత్నం, మేయర్ కావటి మనోహర్ నాయుడు, డిప్యూటీ మేయర్లు డైమండ్ బాబు , ఎమ్మెల్యే మద్దాలగిరికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ,వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు నాయకులు కార్యకర్తలు అందరి మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం తనకి ఎంతో గర్వంగా ఉందని , మీరందరికి జీవితాంతం రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలియజేశారు.



# ఆ సీక్వెల్ కోసం నాని – నితిన్



హీరో నితిన్ వరుస పెట్టి ప్రాజెక్టులను ఓకే చేస్తున్నాడు. ఇప్పటికే మూడు సినిమాలను లైన్ లో పెట్టాడు ఈ యంగ్ అండ్ డైనమిక్ హీరో. ప్రస్తుతం వక్కంతం వంశీ దర్శకత్వంలో వస్తున్న మూవీ షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమా తర్వాత మైత్రీ మూవీస్ నిర్మాణంలో వెంకీ కుడుముల దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత దిల్ రాజ్ ప్రొడక్షన్ లో రానున్న ఓ సినిమాలో నితిన్ చేయనున్నట్లు తాజాగా సమాచారం అందుతోంది. ఈ లేటెస్ట్ అప్ డేట్ పట్ల సినీ ప్రేక్షకులు ఆసక్తి కనబరుస్తున్నారు. పవన్ కళ్యాణ్ హీరో వకీల్ సాబ్ చేసిన తర్వాత వేణు శ్రీరామ్ సైలెంట్ అయిపోయారు. పెద్దగా ఎక్కడా కనిపించింది లేదు. అయితే తాను కథల పనిలో బిజీగా మారిపోయినట్లు సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. అయితే దిల్ రాజు నితిన్ కోసం ఓ ప్రాజెక్టు రెడీ చేస్తున్నట్లు సమాచారం. నేచురల్ స్టార్ నాని ఎంసీఏ సీక్వెల్ కూడా ప్లాన్ చేస్తున్నారని అందులో నితిన్ కనిపించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అయితే ఎంసీఏ సీక్వెన్స్ కథా పనులు ఎక్కడి వరకొచ్చాయి వాటి సంగతి ఏంటి అనేది తెలియడం లేదు. నితిన్ వక్కంతం వంశీ సినిమా అయిపోయాక.. నితిన్-వేణు శ్రీరామ్-దిల్ రాజ్ సినిమా సెట్స్ పైకి వెళ్తుందని మాత్రం ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. మరో వారం రోజుల్లో ఈ చిత్రానికి సంబంధించిన అప్ డేట్ వచ్చే అవకాశం ఉంది. నితిన్ హీరోగా వచ్చిన మాచర్ల నియోజకవర్గంలో సినిమా అంచనాల మధ్య విడుదలైంది. కానీ ఆ అంచనాలు అందుకోవడంలో విఫలమైంది. ఈ మూవీ తర్వాత నితిన్ కొద్దిగా గ్యాప్ తీసుకున్నాడు. ఆ డిజాస్టర్ నుండి తెరుకున్న తర్వాతే కొత్త కథలు వినడం ప్రారంభించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టులను లైన్ లో పెట్టినట్లు సమాచారం. వెంకీ కుడుముల దర్శకత్వంలో రానున్న సినిమాలో నితిన్ సరసన నేషనల్ క్రష్ రష్మిక మందన్నా నటించనున్నట్లు సమాచారం. వీరి ముగ్గురు కాంబినేషన్ లో వచ్చిన భీష్మ మంచి హిట్ అందుకోగా.. అదే సెంటిమెంట్ ను రిపీట్ చేసి హిట్ అందుకోవాలని వెంకీ కుడుములు మైత్రీ మూవీ మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి" నుంచి ఫస్ట్ సింగిల్ రెడీ.!



ప్రస్తుతం మన టాలీవుడ్ లేడీ సూపర్ స్టార్ హీరోయిన్ అనుష్క చాలా కాలం తర్వాత చేస్తున్న అవైటెడ్ సినిమా "మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి" చిత్రం కోసం తెలిసిందే. జాతి రత్నాలు ఫేమ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో నవీన్ పొలిశెట్టి హీరోగా నటిస్తున్న ఈ సినిమాపై ఆడియెన్స్ లో స్పెషల్ అంచనాలు ఉన్నాయి. మరి ఈ సినిమా నుంచి మేకర్స్ అయితే ఒకో అప్డేట్ తో మంచి ఆసక్తి రేపుతూ ఉండగా లేటెస్ట్ గా అయితే సినిమా ఫస్ట్ సింగిల్ పై ఇంట్రెస్టింగ్ అనౌన్సమెంట్ ని అయితే అందించారు. మరి ఫస్ట్ సింగిల్ గా "నో నో నో" అంటూ ఫస్ట్ సింగిల్ ని రేపు ఉగాది కానుకగా రిలీజ్ కి సిద్ధం చేస్తున్నట్టుగా అనౌన్స్ చేశారు. మరి వాట్సాప్ చాట్ లాంటి ఇంట్రెస్టింగ్ వీడియో చేసి తెలిపారు. మరి ఈ సాంగ్ కి అయితే టైం ఇంకా ఫిక్స్ అవ్వాల్సి ఉంది. మరి ఈ సినిమాకి రాధన్ సంగీతం అందిస్తుండగా ఈ సాంగ్ ఎలా ఉంటుందో చూడాలి. ఇక ఈ సినిమాకి యూవీ క్రియేషన్స్ వారు నిర్మాణం వహిస్తుండగా అతి త్వరలోనే థియేట్రికల్ రిలీజ్ కానుంది.

# స్టార్ హీరో సినిమా సీక్వెల్ కి సంకట పరిస్థితి

కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర నటించిన కబ్జా భారీ అంచనాల నడుమ ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. పాన్ ఇండియా రేంజ్ లో ఉపేంద్ర ఈ సినిమాను ప్రమోట్ చేసి రిలీజ్ చేయడం జరిగింది. ఇటీవల విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకుల నుండి పాజిటివ్ రెస్పాన్స్ దక్కలేదు. సినిమా తీవ్రంగా నిరాశ పరిచింది. కన్నడంలో కాస్త పర్వాలేదు అనిపించుకున్నా ఇతర భాషల్లో మినిమం వసూళ్లు రాబట్టలేకపోయింది. కేజీఎఫ్ రెండు పార్ట్ లుగా విడుదల అయి భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. ఇంకా పలు సినిమాలు కూడా రెండు పార్ట్ లుగా విడుదల అయ్యి సంచలన విజయాన్ని సొంతం చేసుకున్నాయి. కనుక కబ్జా సినిమాను కూడా రెండు పార్ట్ లుగా విడుదల చేయాలని ముందే ప్లాన్ చేశారు. ఇప్పటికే సీక్వెల్ షూటింగ్ లో సగానికి పైగా పూర్తి చేశారట. కబ్జా మొదటి పార్ట్ నిరాశ పర్చుడంతో రెండవ పార్ట్ ను గురించి ఎవరు పట్టించుకునే పరిస్థితి లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కబ్జా మొదటి భాగంలో గెస్ట్ రోల్స్ లో కనిపించిన కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ మరియు కిచ్చ సుదీప్ లు రెండవ భాగంలో ఫుల్ లెంగ్త్ రోల్స్ లో కనిపించబోతున్నారంటూ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చిత్ర దర్శకుడు చంద్రు పేర్కొన్నాడు. మొదటి భాగం నిరాశ పర్చితే రెండవ పార్ట్ ఫలితం ఎలా ఉంటుందో ఇప్పటికే పలు సందర్భాల్లో నిరూపితమయింది. ఇలాంటి సందర్భంలో కబ్జా రెండవ పార్ట్ విడుదలయ్యే అవకాశం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే షూటింగ్ చాలా భాగంగా పూర్తి చేయడంతో పాటు విడుదల విషయంలో సస్పెన్స్ నెలకొంది. ఒక వేళ విడుదల చేయాలనుకున్నా కన్నడం వరకు పర్వాలేదు కానీ ఇతర భాషల్లో మినిమం బజ్ కూడా క్రియేట్ అయ్యే అవకాశం లేదు.

# ఇంకా బతికే ఉన్నాను: కోట శ్రీనివాసరావు


ఇటీవల కబ్జాలో నటించిన ప్రముఖ తెలుగు నటుడు కోట శ్రీనివాసరావు గురించి కొందరు నెటిజన్లు తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నారు. కోట శ్రీనివాసరావు అస్వస్థతకు గురయ్యారని, ఆసుపత్రిలో చేరారని కొందరు నెటిజన్లు ప్రచారం చేస్తున్నారు. చాలా మంది ఈ వార్తలను విశ్వసించారు. 75 ఏళ్ల నటుడు కోలుకోవాలని ప్రార్థించారు. ఈ విషయంపై క్లారిటీ ఇస్తూ కోట శ్రీనివాసరావు గారు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నారని, బాగానే ఉన్నారని వీడియో ప్రకటన విడుదల చేశారు. అంతేకాకుండా, తప్పుడు వార్తలను నమ్మవద్దని ప్రజలను అభ్యర్థించారు. తప్పుడు వార్తలను వ్యాప్తి చేసే వ్యక్తులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.








# విశ్వక్ సేన్.. ఓ లోకేష్ కనగరాజ్!



విశ్వక్ సేన్ హీరోగా స్వీయ దర్శకత్వంలో తెరక్కిన సినిమా దాస్ కా దమ్కీ. ఈ మూవీ మార్చి 22న ప్రేక్షకుల ముందుకి రాబోతుంది. విశ్వక్ సేన్ కెరియర్ లో అవుట్ అండ్ ఔట్ కమర్షియల్ యాక్షన్ ఎంటర్టైనర్ గా ఈ సినిమా రాబోతుంది. దీనిపై అతను చాలా హోప్స్ పెట్టుకున్నాడు. ఇక జూనియర్ ఎన్టీఆర్ ప్రీరిలీజ్ ఈవెంట్ కి వచ్చి సినిమాకి విషెస్ చెప్పారు. ఇదిలా ఉంటే ఈ సినిమాలో హీరోయిన్ గా నివేతా పేతురాజ్ నటించిన సంగతి తెలిసిందే. ఈమెకి దమ్కీ మూవీలో మంచి పాత్ర దొరికింది. వీరిద్దరూ కలిసి ఇప్పటికే పాగల్ అనే సినిమాలో నటించారు. ఆ మూవీలో స్క్రీన్ కెమిస్ట్రీ బాగుంది అనే పేరు వచ్చింది. దీంతో మరోసారి దమ్కీ సినిమాలో ఎంటర్టైన్మెంట్ అందించబోతున్నారు. ఇదిలా ఉంటే తాజాగా ఈ మూవీ ప్రమోషన్ ఇంటర్వ్యూలో నివేతా విశ్వక్ సేన్ దర్శకత్వంపై షాకింగ్ కామెంట్స్ చేసింది. విశ్వక్ టాలీవుడ్ లో లోకేష్ కనగరాజ్ లాంటి వాడని పోల్చి చెప్పింది. అతని దగ్గర చాలా ఐడియాస్ ఉన్నాయాని స్టార్ హీరోలకి సెట్ అయ్యే హై వోల్టేజ్ యాక్షన్ కథలకి సంబందించిన ఐడియాస్ అతని దగ్గర ఉన్నాయని పేర్కొంది. బాలకృష్ణ ఎన్టీఆర్ లాంటి స్టార్స్ ని డైరెక్ట్ చేయగలిగే కెపాసిటీ కూడా అతనికి ఉందని చెప్పింది. ముఖ్యంగా గ్యాంగ్ స్టార్ కథలు అంటే అతనికి చాలా క్రేజ్ ఉందని ఆ కథలతో అతను దర్శకుడిగా సినిమాలు చేస్తే మాత్రం కచ్చితంగా స్టార్ డైరెక్టర్ అయిపోతాడు అని పొగిడేసింది. అతనితో రెండు సినిమాలు చేసిన అనుభవం అతని కథలు చెప్పే విధానం చూసిన తర్వాత నాకు షాకింగ్ గా అనిపించింది అని నివేతా పేతురాజ్ ఇంటరెస్టింగ్ కామెంట్స్ చేయడం విశేషం. ఇప్పుడు విశ్వక్ డైరెక్షన్ కెపాసిటీ మీద నివేతా చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

# "ఉస్తాద్ భగత్ సింగ్" బజ్ తో ఫ్యాన్స్ హ్యాపీ.?



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా ఇప్పుడు నటిస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో దర్శకుడు హరీష్ శంకర్ తో ప్లాన్ చేసిన సాలిడ్ ఎంటర్టైనర్ చిత్రం "ఉస్తాద్ భగత్ సింగ్" కూడా ఒకటి. మరి ఈ చిత్రాన్ని అయితే ముందుగా "భవదీయుడు భగత్ సింగ్" గా ప్లాన్ చేయగా దానిలో కొన్ని కీలక మార్పులు చేర్పులు చేసి అయితే మేకర్స్ కొత్తగా అనౌన్స్ చేశారు. ఇక ఈ సినిమాకి సంబంధించి గత కొన్ని రోజులు నుంచి అయితే హీరోయిన్ విషయంలో పలు ఆసక్తికర మాటలే వినిపించాయి. అయితే వారి విషయంలో పెద్దగా ఎగ్జైట్ కానీ ఫ్యాన్స్ ఇప్పుడు లేటెస్ట్ గా వచ్చిన టాక్ తో అయితే ఇంప్రెస్ అయ్యారు. ఉస్తాద్ భగత్ సింగ్ లో అయితే పవన్ సరసన కోలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ మాళవికా మోహనన్ నటించనుంది అంటూ పలు వార్తలు బయటకి రావడం అవి యిట్టె వైరల్ గా మారడం కూడా జరిగింది. అయితే అతి ముఖ్యంగా ఈ కాంబినేషన్ పై వార్తలను పవన్ ఫ్యాన్స్ స్వాగతిస్తున్నారు. ఈ సినిమాకి వీరి జంట పర్ఫెక్ట్ గా ఉంటుంది అని అనుకుంటున్నారు. మరి దీనిపై అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది.






Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com